తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460



ఎడిటర్ : గడ్డం నారాయణ

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

సోమవారం

2 డిసెంబర్ 2024

సంపుటి : 02

సంచిక : 165

పేజీలు : 12

వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna




## హామీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం

- అమలుపై ప్రశ్నించి తీరుతాం
- నిర్మాణాత్మక చర్చకైతే మేం సిద్ధం
  బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- కాంగ్రెస్ పాలనపై బీజేపీ చార్జిషీట్ విడుదల

(తరంగాలు) హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. రేవంత్‌రెడ్డి సర్కారు -మిగతా 3 లో




# సంక్రాంతి తర్వాత రైతు భరోసా

- అసెంబ్లీ సమావేశాల్లో విధివిధానాలపై చర్చ
- మారీచ, సుబాహుల మాటలు నమ్మొద్దు
- కేసీఆర్ చేసిన అప్పులపై ప్రతినెలా రూ.6,500 కోట్లు వడ్డీలు కడుతున్నాం
- అయినా ప్రజాసంక్షేమంలో వెనక్కి తగ్గం
- రాష్ట్రంలో పండే ధాన్యాన్నే రేషన్ దుకాణాల ద్వారా ఇస్తాం
  సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

(తరంగాలు) హైదరాబాద్

సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామనీ, త్వరలో విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా విధివిధానాలపై చర్చిస్తామని తెలిపారు. రైతు రుణమాఫీని పూర్తిచేసినట్టే, రైతు భరోసా హామీని కూడా అమలు చేస్తామని స్పష్టంచేశారు. పాలమూరులో జరిగిన రైతు పండుగలో వేలాది మంది రైతులు పాల్గొని ప్రభుత్వానికి ఆశీర్వాదం ఇచ్చారని చెప్పారు. ఆదివారం -మిగతా 3 లో



## ఢిల్లీలో ఒంటరి పోరే

- ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ

వచ్చే ఏడాది దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.ఈ నేపథ్యంలో తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కీలక నిర్ణయం తీసుకొంది. ఇండియా బ్లాక్‌తో పొత్తుకు తాము సిద్ధంగా లేమని.. ఒంటరిగానే పోటీ చేస్తామని ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రకటించారు. "ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ -మిగతా 3 లో

# మనం గర్జిస్తే.. ఢిల్లీ పీఠం కదలాలి

- పార్లమెంట్లో చర్చ జరగాలి
- వెనకడుగు వేస్తే ముప్పు తప్పదు
- వర్గీకరణ.. ఐక్యతను దెబ్బతీసే కుట్ర
- ఈ పోరాటం, జోష్ ఇక ఆగొద్దు
- ఇక దేశవ్యాప్త ఉద్యమం తప్పదు
- మాలల 'సింహ గర్జన'లో ఎక్తా
  అంబేద్కర్ జాతీయ నేత చిరాగ్ పాశ్వాన్




(తరంగాలు)–హైదరాబాద్

మనం గర్జిస్తే ఢిల్లీ పీఠం కదలాలనీ, ప్రధాని సీటుకు వణుకు పుట్టాలని ఎక్తా అంబేద్కర్ జాతీయ నేత బాదానాథ్ పాశ్వాన్ అన్నారు. మాలల సంఖ్య ఎంత ఉందో ముందు తేల్చండని అన్నారు. అవేవీ చూడకుండా ఎస్సీ వర్గీకరణ చేస్తారని ప్రశ్నించారు. ఈ సభ -మిగతా 3 లో



## ప్రజావ్యతిరేక శక్తులపై పోరాటమే

- ప్రజాహక్కులను కేంద్రం కాలరాస్తోంది
- స్నేహితుల కోసమే మోడీ తాపత్రాయం
- వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ

(తరంగాలు)వాయనాడ్

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వాయనాడ్‌లోని మనంతవాడిలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని, -మిగతా 3 లో



## తెగని మహా పంచాయితీ

- పదవుల పంపకంపై మహాయుతిలో పేచీ
- బీజేపీ అధిష్టానం వైపు అందరి చూపు

(తరంగాలు)ముంబయి

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతికి మెజార్టీ వచ్చినా.. సర్కార్ ఏర్పాటుకు ఢిల్లీ వైపే చూస్తోంది. పదవుల పంపకాల్లో పేచీ బీజేపీ అధిష్టానానికి తల బొప్పికడుతోంది.సీఎం ఎవరన్నదానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉన్నది.మహాయుతి కూటమిలోని నేతలు పైకి నవ్వుతూ స్టేట్‌మెంట్లు ఇస్తున్నా..లోనమాత్రం కుతకుతలాడిపోతున్నారు.ఈ అసమ్మతి ఏవిధంగా చల్లార్చాలని మోడీ, అమిత్‌షా సమాలోచనలు చేస్తున్నా..ఈ రచ్చ ఎక్కడికి దారితీస్తుందోనన్న -మిగతా 3 లో




## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ వార్నింగ్

- డాలర్ స్థానంలో కరెన్సీ తేస్తే 100 శాతం పన్నులేస్తా

వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికన్ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నాలను విరమించుకోకపోతే బ్రిక్స్ కూటమి, దాని మిత్రదేశాలపై 100 శాతం సుంకాలను విధిస్తానని బెదిరించారు. "మేం నిలబడి చూస్తున్నప్పుడు బ్రిక్స్ దేశాలు డాలర్‌కు దూరంగా -మిగతా 3 లో

# ఏడుగురు మావోయిస్టులు మృతి

- చల్పాక అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్
- మృతుల్లో మావోయిస్టు కీలక నేతలు
- లొంగిపోవాలని హెచ్చరించాం
- ములుగు జిల్లా ఎస్పీ శబరీష్

(తరంగాలు)ఏటూరునాగారం ఐటీడీఏ

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చల్పాక అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం 4గంటల ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీస్ బలగాలు, యాంటీ మావోయిస్టు స్క్వాడ్ అడవుల్లో జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. డిసెంబర్ 2 నుంచి 8 వరకు మావోయిస్టు వారోత్సవాలను జరుపుకోవాలని -మిగతా 3 లో



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం



హైదరాబాద్ (తరంగాలు)
టీజీపీఎస్సీ చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశంను నియమిస్తూ.. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. గతంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొగా.. దీనికి సంబంధించిన ఫైల్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. అయితే గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. ప్రస్తుత చైర్మన్ మహేందర్ రెడ్డి పదవీకాలం డిసెంబర్ 3న ముగియనుండగా.. అదే రోజు వెంకటేశం బాధ్యతలు స్వీకరించడానికి లైన్ క్లియర్ అయింది. ఈ క్రమంలో.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం మధ్యాహ్నం.. బుర్రా వెంకటేశం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కాగా టీజీపీఎస్సీ పై గతంలో వచ్చిన ఆరోపణలు, కార్పొరేషన్ ప్రక్షాలణ లక్ష్యంగా బుర్రా వెంకటేశం పనిచేసేందుకు ఆయనను నియమించినట్లు తెలుస్తోంది.

## అంబులెన్స్ బోల్తా..నలుగురు మృతి..



హైదరాబాద్ (తరంగాలు)
కర్నూల్ నుంచి చంపారన్ వెళ్తున్న అంబులెన్స్ బోల్తా పడి నలుగురు మృతి చెందారు. ఏపీలోని కర్నూల్ నుంచి బీహార్ లోని చంపారన్ కు ఓ రోగిని తరలిస్తున్న అంబులెన్స్ బోల్తా పడటంతో అక్కడిక్కడే నలుగురు దుర్మరణం పాలవగా.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్ జబల్ పూర్ –నాగపూర్( NH 34) హైవే మీద వెళ్తుండగా.. మధ్యప్రదేశ్ లోని సియోని వద్ద అదుపు తప్పి, పాదాచారుని మీదికి దూసకువెళ్ళి అనంతరం పక్కన ఉన్న కరెంట్ స్థంబంను ఢీకొట్టిందటి. ప్రమాద సమయంలో ఇద్దరు డ్రైవర్లతో సహా తొమ్మిది మంది ఉన్నారు. వీరిలో నలుగురు అక్కడిక్కడే మరణించగా.. మిగిలిన ఐదుగురికి తేవర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను జిల్లా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## హింసాకాండపై బాధితులతో ఆరా

**–సంభాల్‌లో జ్యుడీషియల్ ప్యానెల్ పర్యటన**



లక్నో:(తరంగాలు)
ఇటీవల హింసాకాండ చెలరేగిన ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జ్యుడీషియల్ ప్యానెల్ బృందం ఆదివారం పర్యటించింది. హింసాకాండ జరిగిన షాహి జామా మసీద్, ఇతర ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించింది. ఈ ప్యానెల్ అధ్యక్షులు అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి దేవేంద్ర కుమార్ ఆరోరా, ప్యానెల్ సభ్యులు మాజీ ఐపీఎస్ అరవింద్ కుమార్ జైన్ ఆదివారం పర్యటనలో పాల్గొన్నారు. అయితే ముగ్గురు సభ్యులు గల ప్యానెల్‌లో మరొక సభ్యులు మాజీ ఐఎఎస్ అధికారి అమిత్ మోహన్ ఆదివారం పర్యటనలో పాల్గొనలేదు. ఆదివారం పర్యటన సందర్భంగా బృందం వెంట మోరదబాద్ డివిజినల్ కమిషనర్ అంజనేయ కుమార్ సింగ్, డీఐజీ మునిరాజ్ జి, సంభాల్ జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర పెన్సియా, ఎస్పీ కృష్ణ కుమార్ కూడా ఉన్నారు. ఈ ప్యానెల్‌ను గత నెల 28న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. రెండునెలల్లో విచారణ పూర్తి చేయాలని ఆదేశించింది. నవంబరు 24న హింసాకాండకు దారి తీసిన పరిస్థితులను, అలాగే పరిస్థితులను ఎదుర్కొవడంలో పోలీసుల, పరిపాలన యంత్రాంగం సన్నద్ధతను పరిశీలించే బాధ్యతను ప్యానెల్‌కు అప్పగించారు. హింసాకాండకు దారితీసిన పరిస్థితులను ఈ ప్యానెల్ విశ్లేషిస్తుంది. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల దిశగా సర్కారు

**-రూ.2 వేల కోట్లు అదనంగా కేటాయించిన ప్రభుత్వం**



హైదరాబాద్(తరంగాలు)
ఏడాది కాలంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల దిశగా సర్కారు పలు నిర్ణయాలు తీసుకున్నది. ఈ ఏడాది (2024-25) బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇది గతేడాది బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ. ఒక్క ఏడాదిలోనే రూ.2 వేల కోట్లకుపైగా అదనపు కేటాయింపులు చేసింది. పాఠశాలల ప్రారంభానికి ముందే మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసింది. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించింది. పాఠశాలలు తెరిచిన రోజే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు యూనిఫాంలు (ఏకరూప దుస్తులు), పాఠ్యపుస్తకాలను అందజేసింది. రాష్ట్రవ్యాప్తంగా 21,419 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీ చేసింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించింది. వెంటనే ఫలితాలు ప్రకటించి అతి తక్కువ సమయంలోనే ఆ ఉపాధ్యాయుల నియామకాలను పూర్తి చేసింది. డీఎస్సీకి ముందు టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. టెట్ రాసిన వారు డీఎస్సీ రాశారు. ఇక నుంచి ఏటా రెండు సార్లు టెట్ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టారు. 2024, అక్టోబరు 11న కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శంకుస్థాపన జరిగింది. నైపుణ్య విద్యను అందించేందుకు వీలుగా రాష్ట్రంలోని 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఐటీసీ) మారుస్తున్నారు. అలాగే అకడమిక్ కోర్సులు, పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడమే లక్ష్యంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించింది. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు పాఠశాల స్థాయిలో ప్రహరి క్లబ్‌లను ఏర్పాటు చేశారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న డైట్ ఛార్జీలను పెంచింది. ఈ పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.300 కోట్లకుపైగా అదనపు భారం పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లోని 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోంది. డైట్ ఛార్జీలతో పాటు విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించిన సర్కారు బోధన, బోధనేతర సిబ్బంది శాశ్వత నియామకానికి ప్రభుత్వం యోచిస్తోంది. ట్రాఫిక్ నియంత్రణ, మహిళా భద్రత, రహస్య కెమెరాల పర్యవేక్షణ కోసం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల కమ్యూనిటీ సర్వీస్ ప్రోగ్రామ్ ప్రారంభించింది. సాంకేతిక విద్యా విభాగంలో 24 లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేశారు. 247 లెక్చరర్ పోస్టులకు సంబంధించి సాధారణ మెరిట్ లిస్టు విడుదల చేశారు. 37 ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహణ పూర్తయింది.

# పర్యావరణ పరిరక్షణకు సహకరించండి

**– ప్రభుత్వ కార్యాచరణకు తోడుగా ప్రజలు ఉద్యమిస్తేనే లక్ష్యాలు నెరవేరే అవకాశం : మంత్రి కొండా సురేఖ**



హైదరాబాద్(తరంగాలు)
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలనీ, ప్రభుత్వ కార్యాచరణకు తోడుగా ప్రజలు ఉద్యమిస్తేనే ఆశించిన లక్ష్యాలు నెరవేరే అవకాశం ఉంటుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహకరించాలని కోరారు. సోమవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి సురేఖ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మనుషుల తప్పిదాల వల్ల ప్రాణాధారమైన గాలి, నీరు, నేల రోజు రోజుకీ విషతుల్యమై, ప్రాణాలను హరిస్తున్న పరిస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. 1984 డిసెంబర్ రెండో తేదీన జరిగిన బోపాల్ గ్యాస్ దుర్ఘటనను గుర్తుచేశారు. ఆ ప్రమాదం మనదేశంలోనే గాక ప్రపంచలోనే ఘోర పారిశ్రామిక విపత్తుగా మిగిలిందనీ, ఆనాడు వేల మంది మరణించగా..6 లక్షల మందికిపైగా ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు. పరిశ్రమల కాలుష్యాన్ని నివారించడంతో పాటు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రతి ఏటా డిసెంబర్ రెండో తేదీన జాతీయ కాలుష్య నియంత్రణ దినాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది "స్వచ్ఛమైన గాలి, పచ్చని భూమి %-% సుస్థిరమైన జీవనం వైపు అడుగు" అనే నేపథ్యంతో ప్రజలకు కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించే దిశగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కాలుష్య నియంత్రణ దినాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ పర్యావరణ అనుకూల వస్తువులను వాడటంతో పాటు, మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచాలని కోరారు.

# చర్చకు ససేమిరా

**- కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి**
**-వాయిదాల పర్వంతో ముగిసిన తొలి వారం**
**-లోక్‌సభలో 54 నిమిషాలు..రాజ్యసభలో 75 నిమిషాలే కార్యకలాపాలు**



(తరంగాలు)న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలి వారం ముగిసింది. ఈ వారంలో లోక్‌సభలో 54 నిమిషాలు, రాజ్యసభలో 75 నిమిషాల పాటు మాత్రమే కార్యకలాపాలు జరిగాయి. అదానీ గ్రూపుపై వచ్చిన అవినీతి ఆరోపణలను విచారించాలని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేసినా ప్రభుత్వం అందుకు అంగీకరించక మొండి వైఖరి అవలంబించింది. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో చెలరేగిన హింస పైన కూడా చర్చ జరపాలని ప్రతిపక్షాలు కోరాయి. దానికి కూడా ప్రభుత్వం ససేమిరా అంది. తీవ్ర గందరగోళం మధ్య ఉభయ సభలు అనేక సార్లు వాయిదా పడ్డాయి.
గత వారంలో సోమవారం 6 నిమిషాలు, బుధవారం 14 నిమిషాలు, గురువారం 14 నిమిషాలు, శుక్రవారం 20 నిమిషాల పాటు మాత్రమే లోక్‌సభ పనిచేసింది. ఇక పెద్దల సభ విషయానికి వస్తే సోమవారం 33 నిమిషాలు, బుధవారం 13 నిమిషాలు, గురువారం 16 నిమిషాలు, శుక్రవారం 13 నిమిషాలు నడిచింది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉభయ సభలు మంగళవారం సంయుక్తంగా సమావేశమ య్యాయి. సభా కార్యక్రమాలను అడ్డుకోవడానికి ప్రతిపక్ష పార్టీలు 267వ నిబంధనను ఓ ఆయుధం గా వాడుకుంటున్నాయని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా కార్యక్రమాల ను పక్కన పెట్టి తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ జరపాలని కోరడానికి ప్రతిపక్షాలు రూల్ 267 కింద నోటీసులు ఇవ్వడం పరిపాటి. అయితే ఈ నోటీసులను ధన్‌కర్ తప్పుపడుతూ 'ప్రతిపక్ష సభ్యులు పదేపదే ఈ అంశాలను లేవనెత్తారు. ఫలితంగా మనం ఇప్పటికే మూడు పని దినాలను కోల్పోయాం' అని ఆయన శుక్రవారం వాపోయారు. పత్రాలను సభ ముందు ఉంచడం, ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఇద్దరు సభ్యుల ప్రమాణస్వీ కారం, వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలిస్తున్న జేపీసీ గడువు పొడిగించడం వంటి సాధారణ కార్యకలాపా లతోనే గత వారం గడిచిపోయింది.
అదానీ గ్రూపుపై వచ్చిన ముడుపుల ఆరోపణలు, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో హింస, మణిపూర్‌లో కొనసాగుతున్న అల్లర్లపై చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో ఉభయ సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉభయ సభలు వచ్చే వారానికి వాయిదా పడిన అనంతరం కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ శుక్రవారం ఎక్స్‌లో స్పందిస్తూ వాయిదాలను ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకించడంలేదో అంతుచిక్కని పెద్ద మిస్టరీగా ఉన్నదని వ్యాఖ్యానించారు. 'మోదానీ విషయంపై పార్లమెంట్‌లో గందరగోళం కొనసాగింది. ఉభయ సభలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదా పడ్డాయి.
ఈ వాయిదాలను ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకించడం లేదన్నదే పెద్ద మిస్టరీగా ఉంది. మోదానీ, మణిపూర్, సంభాల్, ఢిల్లీలో శాంతి భద్రతలు తదితర అంశాలపై ఇండియా భాగస్వామ్య పక్షాలు చర్చకు డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదు?' అని ప్రశ్నించారు. మణిపూర్ విషయంలో మోడీ ఎందుకు మౌనం వహించారని, మోడీ–షా ద్వయం పార్లమెంటును పదేపదే ఎందుకు వాయిదా వేస్తోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరికా ఘోష్ నిలదీశారు.

తరంగాలు
Tharangalu Daily News Paper

# సంక్రాంతి తర్వాత రైతు భరోసా

(మొదటి తరువాయి)

జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాపై మారీచ, సుబాహులు (బీజేపీ, బీఆర్ఎస్) చెప్పే రాక్షస మాటలు విని ఆగం కావొద్దని రైతాంగానికి హితవు చెప్పారు. సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసా సొమ్మును ఖాతాల్లో వేస్తామనీ, ఇందిరమ్మ ప్రభుత్వంలో సోనియమ్మ గ్యారెంటీ అమలై తీరుతుందనీ, ఆ బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటానని స్పష్టం చేశారు. వాస్తవాల ప్రాతిపదికగా తమ ప్రభుత్వం భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో, రూ.69 వేల కోట్ల అప్పులతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత, మాజీ సీఎం కేసీఆర్ నుంచి తిరిగి కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి రూ.7 లక్షల కోట్ల అప్పుతో మా చేతికొచ్చిందని వివరించారు. ఈ అప్పుకు ప్రతినెలా దాదాపు రూ.6,500 కోట్లను కేవలం వడ్డీలుగా చెల్లిస్తున్నామన్నారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందని అప్పటి సీఎం కేసీఆర్, ఆర్థికమంత్రులు టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు ఏనాడూ ప్రజలకు చెప్పకపోగా, బంగారు తెలంగాణ సృష్టిస్తున్నామని అబద్ధాలు చెప్పారని ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడూ ప్రజాసంక్షేమాన్ని విస్మరించలేదనీ, దాన్ని కొనసాగిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నదని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ బకాయి పెట్టిన రూ.7,625 కోట్ల రైతుబంధు సొమ్మును తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించామని గుర్తుచేశారు. రుణమాఫీ, ఉచిత విద్యుత్, సబ్సిడీ ఎరువులు, మద్దతు ధర, ఉపాధి హామీ పథకం లాంటి వాటితో రైతులను ఆదుకుంటున్నామన్నారు. కేవలం 25 రోజుల్లో 22,22,067 మంది రైతులకు రూ.17,869 కోట్లు రుణమాఫీ చేశామనీ, మహబూబ్‌నగర్‌లో రూ.2,747 కోట్ల రుణమాఫీని నాలుగో విడతలో ఇచ్చామని చెప్పారు. మొత్తంగా 25,35,964 మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ పూర్తి చేశామని వివరించారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 29 రాష్ట్రాల్లో ఎక్కడా ఇంత తక్కువ సమయంలో రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసిన చరిత్ర లేదనీ, ఆ రికార్డు కేవలం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే చెందుతుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేవలం రూ.3,331 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందనీ, నాలుగున్నరేండ్లు రుణమాఫీ చేయకపోవడంతో వడ్డీ కింద రైతులు రూ.8,578.97 కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. మారీచ, సుబాహులు (బీజేపీ, బీఆర్ఎస్) సన్న వడ్లకు రూ.500 బోనస్‌పై అపోహలు సృష్టించారని విమర్శించారు. సన్న వడ్లు పండిస్తే, బోనస్ ఇస్తామని తాము చెప్తుంటే, దాన్ని వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం 31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించిందని తెలిపారు. వచ్చే సీజన్‌లో కూడా రూ.500 బోనస్ కొనసాగుతుందని తేల్చిచెప్పారు. తెలంగాణ సోనా, బీపీటీ,హెచ్ఎమ్‌టీ వంటి వంగడాలు వేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందనీ, తెలంగాణ ప్రజలు ఇదే బియ్యాన్ని ఎక్కువగా తింటారన్నారు. ఇక్కడి భూముల్లో పండే ధాన్యాన్నే పేదలకు రేషన్ దుకాణాల్లో ఇవ్వాలనుకుంటున్నామని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు సన్న బియ్యంతోనే భోజనం పెడతామన్నారు. రైతు రుణమాఫీపై అనవసర అనుమానాలు వద్దనీ, రేషన్‌కార్డు లేని వారికి కూడా రుణమాఫీ అయ్యిందని వివరించారు. గుజరాత్‌లో మద్యనిషేధం ఉందని బీజేపీ చెబుతున్నదనీ, అక్కడ ఏ బ్రాండ్‌లు దొరుకుతాయో తీసుకెళ్లి చూపిస్తామని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణతో ఏం సంబంధమని ప్రశ్నించారు. ఆయన గుజరా తీయుల గులాం అని ఇప్పటికే తాను చెప్పానని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2014 నుంచి ఇప్పటి వరకు కేంద్రంలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు, వారి ఎన్నికల మ్యానిఫెస్టోలపై చర్చించేందుకు తన ప్రభుత్వంలోని మంత్రులు సిద్ధంగా ఉన్నారంటూ మరో ప్రశ్నకు స్పందించారు

# హామీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం

(మొదటి తరువాయి)

ఏడాదిలో చేపట్టిన అభివృద్ధిపైనా, ఆరు గ్యారెంటీల అమలుపైనా నిర్మాణాత్మకంగా చర్చించేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. సీఎం తన మాటతీరు మార్చుకోకపోతే మాత్రం చర్చకు రాబోమని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ చార్జిషీట్‌ను ఆయన విడుదల చేశారు. కేసీఆర్ రేవంత్‌రెడ్డి సర్కారు కూడా కేసీఆర్ పాలన బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టు చేస్తున్నారని చెప్పారు. డిసెంబర్ 9న చేస్తామన్న రుణమాఫీ నేటికీ పూర్తిచేయలేదనీ, రైతుభరోసా డబ్బులు వేయలేదని విమర్శించారు. మ్యానిఫెస్టోలో పది పంటలకు ఇస్తామన్న బోనస్ ఏమైందని నిలదీశారు. కేవలం సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. ఫార్మా సిటీకి వ్యతిరేకంగా అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ పోరాటం చేసిందనీ, ఇప్పుడు బీఆర్ఎస్ బాటలో రేవంత్ సర్కారు వెళు_న్నదని చెప్పారు. యువ వికాసం ఉత్తమాటగా మిగిలిందనీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదనీ, రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు కానరాకుండా పోయిందని విమర్శించారు. పాఠశాలల్లో పిల్లలకు కనీసం నాణ్యమైన భోజనాన్ని అందించలేని స్థితిలో రాష్ట్ర సర్కారు ఉందన్నారు. 18 ఏండ్లు దాటిన విద్యార్థినులకు స్కూటీలు ఏవని ప్రశ్నించారు. రూ.2 వేల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామన్న హామీ ఉత్తిమాటగానే మిగిలిందన్నారు. మహిళలకు, ఆటోడ్రైవర్లకు, యువతకు, దళితులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో పదేండ్లుగా ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తాం..రేషన్‌కార్డుపై సన్నబియ్యం ఇస్తాం హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని నిలదీశారు. మూసీ ప్రక్షాళన భూ దందా కోసమే చేస్తున్నారనీ, అందుకే పేదల ఇండ్లు కూల్చుతున్నారని ఆరోపించారు. వస్తున్న ఆదాయానికి మించి అప్పులు చేస్తూ దుబారా ఖర్చులు పెడుతున్నదని విమర్శించారు. కుల గణనకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. భూసేకరణ చేపట్టే సమయంలో పద్ధతి ప్రకారం నడుచుకోవాలనీ, రైతులతో మాట్లాడి పరిష్కారం చేసుకోకుండా రైతులపై దాడులా అని ప్రశ్నించారు.

# మనం గర్జిస్తే.. ఢిల్లీ పీఠం కదలాలి

(మొదటి తరువాయి)

మాల సామాజిక వర్గంలో జోష్ నింపుతుందని అభిప్రాయపడ్డారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'మాలల సింహ గర్జన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు నిర్ణయంపై మాల అడ్డుకుంటారనే విషయం కేంద్ర ప్రభుత్వానికి తెలిసిపోయిందన్నారు. ఇదే స్థాయిలో ఉద్యమాన్ని కొనసాగిస్తే. ఈ సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుందన్నారు. పార్లమెంట్‌లో మాలల గురించి చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా పోరాటాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. బహుజన దళితుల కోసం పోరాటం చేస్తున్నామని, తెలంగాణ, ఏపీలో కాదు. ఢిల్లీలో చర్చ జరగాలన్నారు. దిశగా కార్యాచరణ అమలు చేయాలని మాల సామాజికవర్గం నేతలకు పిలుపునిచ్చారు. దేశ రాజధాని ఢిల్లీ వరకు మాలల పోరాటం చేరితే మోడీ కుర్చీ కదలాలని నినదించారు. మాలలు ఏకం కావడంతో మైదానం సరిపోలేదన్నారు. దేశంలోనే ఇంత మంది మాలలు ఒకే చోట చేరడం ఇక మొదటిసారి అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మైదానానికి తరలి వచ్చినట్టే ఢిల్లీకి రావాలని కోరారు. తాము అండగా ఉంటామని తెలిపారు. మాలల హక్కులను కాలరాసేలా సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగానే అలాంటి మాలల పోరాటం అని స్పష్టం చేశారు. మాలల కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. దేశవ్యాప్త ఉద్యమం తప్పదనీ, అందుకు సంసిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఐక్యతను దెబ్బ తీసే కుట్ర: ఎంపీ మల్లు రవి**

ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కి వ్యతిరేకంగా ఉందని ఎంపీ మల్లు రవి అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుపై మాలల పోరాటమని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు లేకుండా చేయాలనే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. షెడ్యూల్ కులాలను ఆదుకునేందుకు అంబేద్కర్ రిజర్వేషన్లు తెచ్చారని గుర్తు చేశారు. రిజర్వేషన్ ఫలాల వల్లనే సమాజంలో ఎస్సీలు కొంత ముందుకువచ్చారని తెలిపారు. సమాజంలో కుల వ్యవస్థ మనల్ని ఇంకా వెంటాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ ఇచ్చిన హక్కులను కూడా తప్పకుండా పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాలడ్ చేశారు.

**వెనక్కి తగ్గేదేలేదు: ఎమ్మెల్యే వివేక్**

మాలల సింహ గర్జన మీటింగు ఎంతో మంది అవహేళన చేశారని వివేక్ చెప్పారు. కానీ సొంత ఖర్చులతో వివిధ ప్రాంతాలు నుంచి పెద్దఎత్తున తరలివచ్చి సభను సక్సెస్ చేశారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మన గౌరవాన్ని మనమే కాపాడుకోవాలని కోరారు. కుల వివక్ష చూసే అంబేద్కర్ రాజ్యాంగంలో మనకు రిజర్వేషన్లు కల్పించారని.తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు నాగరాజు, వినోద్, నాయకులు జి చెన్నయ్య, మందాల భాస్కర్, గాయకులు రెంజర్ల రాజేష్, గోరటి రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు కళా బృందాల ప్రదర్శలను ఆకట్టుకున్నాయి.

# తెగని మహా పంచాయితీ

(మొదటి తరువాయి)

భయం కూడా వెంటాడుతోందని పార్టీశ్రేణుల్లో వినిపిస్తోంది. ఓవైపు ఉప ముఖ్యమంత్రికే హోం శాఖను ఇవ్వాలని శివసేన పట్టుబడుతున్నది. తమ నేత శిండేను పక్కనబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయుంటూ ఆరోపిస్తోంది. ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్ మాత్రం బీజేపీకే ముఖ్యమంత్రి పదవి అని, ఎన్‌సీపీ, శివసేనలకు ఉప ముఖ్యమంత్రి పదవులు అని అంటున్నారు. తమ ఊళ్లో ఉన్న ఆపద్ధర్మ సీఎం శిండే మీడియా ముందుకు వచ్చి మా కూటమిలో ఎలాంటి బేధాల్లేవంటున్నారు. ముంబయికి త్వరలో వెళ్తానంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇప్పటికే హోంమంత్రి శాఖ కావాలంటున్న శిండే..తనయుడు శ్రీకాంత్ శిండేకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. సీఎం ఎవరో తేల్చకుండానే ఐదో తేదీన ముహూర్తం ఖరారు కావటం..ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవుతున్న నేపథ్యంలో..పదవుల పేచీతో మహాయుతి కూటమి విచ్ఛిన్నం దిశగా అడుగులు వేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

# ప్రజావ్యతిరేక శక్తులపై పోరాటమే

(మొదటి తరువాయి)

ప్రసంగించారు. ప్రజలకు ఉన్న హక్కులను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్న శక్తులపై తాము ఎంతో కాలంగా పోరాటం చేస్తుంటే..ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ప్రజల గురించి కాకుండా తమ స్నేహితుల అభివృద్ధికి మాత్రమే కృషి చేస్తున్నారని ఆరోపించారు. వాయనాడ్‌లో వరదలు సృష్టించిన విలయంలో ప్రజలు తీవ్రంగా నష్టపోయినా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహాయాన్ని అందించట్లేదని మండిపడ్డారు. వాయనాడ్ ఎంపీగా అక్కడి ప్రజల అవసరాలు, హక్కుల కోసం పార్లమెంట్‌లో తన గొంతుకను వినిపిస్తానని..వారి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు. మన దేశంలో ఉన్న వ్యవస్థలను బలహీనం చేయడానికి ప్రయత్నిస్తున్న వారికి వ్యతిరేకంగా ప్రజలు కలిసికట్టుగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ఏజెన్సీలను ఎన్డీఏ ప్రభుత్వం పావులుగా వాడుకుంటూ.. ప్రతిపక్షాలను భయపెట్టడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. రెండు రోజుల కేరళ పర్యటనలో లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని తిరువంబాడిలోని ముక్కం, నికంబూర్‌లోని కౌలై, వందూరు, కొరుకోడ్, మలప్పురం జిల్లాల్లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఆదివారం మనంతవాడి ప్రాంత ప్రజలను కలిసి, వారి బాగోగులు తెలుసుకున్నారు.

# ఢిల్లీలో ఒంటరి పోరే

(మొదటి తరువాయి)

పొత్తులకు దూరంగా ఉంటుంది. ఒంటరి పోరుకు సిద్ధం అవుతోంది" అని విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా పంజాబ్‌లో కాంగ్రెస్‌తో పొత్తుకు ఆప్ నిరాకరించిన సంగతి తెలిసిందే. 13 స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగింది.మరోవైపు, ఢిల్లీ ఎన్నికల్లో పొత్తు లేకుండా పోటీ చేస్తామని ఇప్పటికే కాంగ్రెస్ కూడా ప్రకటించింది. ఈ క్రమంలోనే ఆప్ కూడా ఒంటరి పోరుకు సిద్ధమంటూ తాజాగా తెలిపింది. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సమయం ఉంది కాబట్టి..చివర్లో కేజ్రీవాల్ తీరు మారవచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాగా.. దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కేజ్రీవాల్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన సంచలనం రేపింది. మెరుపు వేగంతో స్పందించిన భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది.

# బ్రిక్స్ దేశాలకు ట్రంప్ వార్నింగ్

(మొదటి తరువాయి)

ఉండటానికి ప్రయత్నిస్తున్నాయనే ఆలోచన ముగిసింది" అని ట్రంప్ ఆదివారం ఎక్స్ లో పోస్ట్ చేశారు. ప్రారంభంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా , దక్షిణాఫ్రికాతో కూడిన బ్రిక్స్ గ్రూప్, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియాలను చేర్చడానికి విస్తరించింది. కొత్త రిజర్వ్ కరెన్సీ కోసం పిలుపునిచ్చిన రష్యా, చైనాల ప్రమేయంతో డాలర్‌కు ప్రత్యామ్నాయా లను సృష్టించడం గురించి బ్రిక్స్ ఆలోచిస్తోంది. గత ఏడాది దక్షిణాఫ్రికాలో జరిగిన సమ్మిట్‌లో, రష్యాలోని కజాన్‌లో జరిగిన అక్టోబర్‌లో జరిగిన సమ్మిట్‌లో బ్రిక్స్ కరెన్సీ ప్రతిపాదనపై చర్చించినట్టు మీడియా నివేదించింది. "ఈ దేశాలు కొత్త బ్రిక్స్ కరెన్సీని సృష్టించవు లేదా శక్తివంతమైన యూఎస్ డాలర్‌ను భర్తీ చేయడానికి మరే ఇతర కరెన్సీని తిరిగి ఇవ్వవు. అలాచేస్తే 100 శాతం టారిఫ్‌లను ఎదుర్కొంటారు. అంతేకాదు యూఎస్‌లో విక్రయించడానికి వీడ్కోలు చెప్పాలని సూచించారు. ఈ దేశాల నుంచి మాకు నిబద్ధతతో కూడిన ఆర్థిక వ్యవస్థ" అవసరమని అని ట్రంప్ ఆదివారం అన్నారు. అక్టోబర్ బ్రిక్స్ సమ్మిట్‌లో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాశ్చాత్య దేశాలు ఆంక్షల ద్వారా డాలర్‌ను "ఆయుధీకరణ" చేస్తున్నాయని విమర్శిం చారు, ఇది "ఈ కరెన్సీపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది . దాని అధికారాలను తగ్గిస్తుంది" అని అన్నారు. "డాలర్‌ను ఉపయోగించడానికి నిరాకరించేది మేము కాదు%ొ% మేము ప్రత్యామ్నాయాల కోసం వెతకవలసి వస్తుంది" అని పుతిన్ జోడించారు. అయితే, డాలర్‌ను భర్తీ చేసే అవకాశాలను ట్రంప్ తోసిపుచ్చారు. "అంతర్జాతీయ వాణిజ్యంలో యూఎస్,బ్రిక్ దేశాలు భర్తీ చేసే అవకాశం లేదు. ఏ దేశం ప్రయత్నించినా అమెరికాకు వీడ్కోలు పలకాలి" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తాజా టారిఫ్ బెదిరింపులు మెక్సికో, కెనడా ,చైనాలకు ఈ వారం ప్రారంభంలో ట్రంప్ జారీ చేసిన ఇలాంటి హెచ్చరికలను ప్రతిధ్వనిస్తున్నాయి.

# ఏడుగురు మావోయిస్టులు మృతి

(మొదటి తరువాయి)

మావోయిస్టులు కరపత్రాలను విడిచివెళ్లిన సంఘటన తెలిసిందే. కాగా మావోయిస్టు వారోత్సవాలను పోలీసులు భగం చేసేందుకు గుత్తికోయ గుడాలు, అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో జల్లడ పడుతున్నారు.

ఈ క్రమంలో అడవుల్లో మోహరించిన గ్రేహౌండ్స్ దళాలకు పులకమ్మ వాగు సమీపంలోని అడవిలో మావోయిస్టులు ఎదురుపడటంతో హోరాహోరీగా ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు హతమ య్యారు. మృతులు.. ఇల్లందు, నర్సంపేట ఏరియా దళ కమాండర్‌గా పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా చేరమంగి గ్రామానికి చెందిన కురుసం మంగు అలియాస్ బద్రు అలియాస్ పాపన్న (35), ఏటూరునాగారం, మహాదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన గోలపు మల్లయ్య అలియాస్ మధు(43), ఏసీఎంగా పనిచేస్తున్న బీజాపూర్ జిల్లా ఉసురు గ్రామానికి చెందిన ముసాకి దేవల్ ఆలియాస్ కరుణాకర్ (22), బైరాంఘర్ గ్రామానికి చెందిన ఏసీఎం ముసాకి జమున(23)గా గుర్తించారు. అలాగే, పార్టీ సభ్యులుగా పనిచేస్తున్న ఇంద్రావతికి చెందిన జై సింగ్ (25), బీజాపూర్ జిల్లా గంగులూరు గ్రామానికి చెందిన కిషోర్ (22), ఉసూర్ గ్రామానికి చెందిన కామేష్ (23)గా పోలీసులు నిర్ధారించారు. రెండు ఏకే 47లతోపాటు మందు గుండు సామగ్రి, ఆయుధాలు భారీగా లభించినట్టు తెలిసింది. పదేండ్లకు ముందు ఏటూరునాగారం, తాడ్వాయి, కన్నాయిగూడెం అడవుల్లో ఎన్‌కౌంటర్లు భారీగా జరిగేవి. కాగా పది సంవత్సరాలపాటు నిశ్శబ్దంగా ఉన్న గిరిజన పల్లెల్లో ఒక్కసారిగా తుపాకుల మోత వినబడటంతో మళ్లీ అలజడి మొదలైంది. లొంగిపోవాలని హెచ్చరించాం : ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ మావోయిస్టులు మారుమూల పల్లెలో తలుదాచుకున్నారనే సమాచారం మేరకు పోలీస్ గ్రేహౌండ్స్ దళాలు పల్లెలు, అడవుల్లో సోదాలు చేపట్టి నట్టు ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ తెలిపారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్ కు 'మహా'పాఠం

రాజకీయంగా ఆర్థికంగా దేశంలో అత్యంత కీలక పాత్ర వహించే మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు బిజెపి, ఎన్‌డిఎలకు అమితానందం కలిగిస్తే కాంగ్రెస్, 'ఇండియా' వేదికకు తీవ్ర నిరుత్సాహానికి గురిచేశాయి. నవంబరు 20న పోలింగ్ ముగిసిన ఈ రాష్ట్రంలో ఫలితాలు 23వ తేదీన వెలువడ్డాయి. సాధారణ అంచనాలు ఎగ్జిట్ పోల్స్ లెక్కలు తారుమారయ్యాయి. బిజెపి, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి చీలిక వర్గాలతో ఏర్పడిన పాలక మహాయుతి కూటమి 288 స్థానాలలో 230 పైగా తెచ్చుకుని ఘన విజయం సాధించింది. బిజెపికి 132, ఏక్‌నాథ్ షిండే శివసేనకు 57, అజిత్ పవార్ ఎన్‌సిపిఎ కి 41 వచ్చాయి. మరోవైపున ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్ థాకరే), ఎన్‌సిపి (శరద్ పవార్) లతో కూడిన మహా వికాస్ అగాఢీ కూటమి పార్టీలలో ఏ ఒక్కటీ ప్రతిపక్ష హోదా కూడా పొందలేకపోయాయి. నిజానికి సేన, ఎన్‌సిపి మూల సంస్థలు ఎంవిఎలో వున్నా పోటీ నేతలతో చీలిపోయిన వర్గాలే అధిక స్థానాలతో వీళ్లను వెనక్కు నెట్టేశాయి. ఆరు మాసాల కిందట జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఎంవిఎ 30 స్థానాలు తెచ్చుకుని సంచలనం సృష్టించింది. మహాయుతి కేవలం 17 స్థానాలకే పరిమితమైంది. అదే సమయంలో రెండు కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 0.4 శాతం మాత్రమే వుండటం వల్ల శాసనసభ ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. లోక్‌సభ ఓటింగులో జాతీయ రాజకీయ కోణాలు ప్రధానంగా పని చేస్తాయి. శాసనసభ ఎన్నికలు రాష్ట్రాలను బట్టి జరుగుతాయి. అక్కడ ఎక్కువ స్థానాలు వచ్చినా అసెంబ్లీ వ్యవహారం భిన్నంగా వుండొచ్చని గతంలో చాలా సార్లు రుజువైంది. అందుకే 'ఇండియా' వేదిక, ప్రత్యేకించి ప్రధాన పాత్ర వహించే కాంగ్రెస్ వాస్తవికత చూపించాలని పరిశీలకులు, భాగస్వామ్య పక్షాలు పదేపదే హెచ్చరిస్తూ వచ్చాయి. హర్యానాలో లోక్‌సభ ఎన్నికలలో సరిసమానంగా సీట్లు తెచ్చుకుని అధికారంలోకి రావడం ఖాయమని హడావుడి చేసిన కాంగ్రెస్ ఘోరంగా దెబ్బతిన్న అనుభవం పని చేస్తుందని భావించారు. లౌకిక శక్తుల ఐక్యతకు సర్దుబాట్లకు ప్రాధాన్యతనివ్వకపోవడమే హర్యానాలో కాంగ్రెస్ ఓటమికి కారణమని తేల్చి చెప్పారు. దీనికి అంతర్గత అనైక్యత కూడా తోడై పరాజయం తీవ్రమైంది. మహారాష్ట్రలోనైనా అలాంటివి మార్చుకోకపోగా అంతకంటే ఘోరంగా దెబ్బతినడం వారికే దిగ్భ్రాంతి కలిగించింది. శివసేనపై ఉద్ధవ్ థాకరే పట్టు సడలిందా, ఎన్‌సిపి కౌటిల్యుడు శరద్ పవార్ ప్రభ తగ్గిందా వంటి ప్రశ్నలూ ముందు నిలిచాయి. మరోవైపు అంత విజయం సాధించిన బిజెపి కూటమి కూడా ముఖ్యమంత్రి ఎంపిక పూర్తి చేసుకోలేకపోవడం బట్టి రాజకీయ సవాళ్లు అర్థమవుతాయి. ఇప్పటికే షిండే అలిగి ఊరెళ్లిపోయారు. అయితే ఏదోవిధంగా అవసరమైతే షిండేను తప్పించైనా సరే బిజెపి దేవేంద్ర ఫడ్నవిస్‌కే పదవి కట్టబెడుతుందని అందరికీ తెలుసు. ధృతరాష్ట్ర కౌగిలిలా బిజెపితో మరీ ముఖ్యంగా మోడీతో అంటకాగిన వారు ఆఖరుకు ఏమవుతారో చెప్పే ఉదాహరణ షిండే. అయినా తెలుగునాట కొందరు నేతలు అందుకు ఆరాటపడుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది.

**రంగంలోకి ఆర్‌ఎస్‌ఎస్**

మహారాష్ట్రలో ఎంవిఎ సీట్ల సర్దుబాటు చర్చల నుంచి నియోజక వర్గాల కేటాయింపు వరకూ అస్తవ్యస్తంగానే జరిగింది. మూడు ప్రధాన పార్టీలే తేల్చుకోలేకపోగా వామపక్షాలు, ఇతర లౌకిక పార్టీలతో సకాలంలో సరైన చర్చలే జరగలేదు. మరోవైపు బిజెపి ఎలాగైనా లోక్‌సభ ఫలితాలను మార్చి అధికారంలోకి రావడమే ఏకైక ధ్యేయంగా వ్యవహరించింది. చివరి మాసాలలో 'లడ్కీ బహెన్ యోజన' వంటి పథకాలను ప్రకటించి రూ.1500 ఆగమేఘాల మీద బదిలీ చేసింది. ఎంవిఎ రూ.3000 ఇస్తామని వాగ్దానం చేసినా అధికారంలో వుండి తక్షణం ఖాతాల్లోకి పంపించారు గనక ఎక్కువ పనిచేసిందని చెబుతున్నారు. దీనికి తోడు కుల, మత ప్రచారాలను మహాయుతి నేతలు దారుణంగా సాగించారు. కలసి వుండాలని చెబుతున్నట్టుగా ఏక్ హైతో సేఫ్ హై (కలిసి వుంటే మనం సురక్షితంగా ఉంటాము), బాటేంగే తో కటేంగే (చీలిపోతే కూల్చేస్తారు) వంటి నినాదాలతో హిందూ మతతత్వ రాజకీయాలను ప్రచారం చేశారు. మోడీ, హోం మంత్రి అమిత్ షా, యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ల త్రయం తోడు ఆర్‌ఎస్‌ఎస్ నేరుగా రంగంలోకి దిగి ఇంటింటికీ తిరిగి జాతీయత, మతం అంటూ ప్రచారం నడిపించింది. అసలు తమ వల్లనే ఈ విజయం సాధ్యమైందని కూడా వారి వాదనగా వుంది. ఎంవిఎను తికమక పెట్టేందుకు గాను శరద్ పవార్ బిజెపితో చేతులు కలిపారనే ప్రచారం నడిపించారు. 2019లో బిజెపిని బలపర్చడానికి శరద్ పవార్ ఆదేశాలపైనే బిజెపితో చర్చలు జరిపామనీ, అప్పట్లో అదానీ కూడా ఆ చర్చలలో పాల్గొన్నారని అజిత్ పవార్ వెల్లడించారు. అదానీ ఇంట్లో చర్చలు జరిగాయి గానీ ఆయనతో భోజనం మాత్రమే చేశామనీ చర్చలలో లేరనీ శరద్ పవార్ వివరణ ఇచ్చినా కలసిన సంగతి మాత్రం కొట్టివేయలేదు. అంతేగాక అజిత్ పవార్‌తో ఆయన కుటుంబ సంబంధాలు కూడా లేనిపోని చర్చలయ్యాయి.

**కాంగ్రెస్ తప్పిదాలు**

కూటమిలో తనకే అత్యధిక స్థానాలలో పోటీ చేయాలని పట్టుపట్టిన కాంగ్రెస్ ప్రచారంలో అంత పదునుగా పాల్గొనలేదు. ఆఖరుకు రాహుల్ గాంధీ కూడా పరిమితంగా తప్ప మీద వేసుకుని ప్రచారం చేసింది లేదు. సంప్రదాయ శివసేన ఓటర్లను ఉద్ధవ్ థాకరే ఆకట్టుకోలేకపోయారు. ఎంవిఎ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందే ఉద్ధవ్‌ను ప్రకటించకపోవడంతో మరాఠా ఆత్మగౌరవ భావన దెబ్బతిన్నదనే ప్రచారం ప్రభావం చూపింది. స్వయంగా ఉద్ధవ్ కూడా ముందే సిఎం పేరు ప్రకటించి వుండాల్సిందని అసంతృప్తి వెలిబుచ్చారు. సిపిఎం, సిపిఐ, ఎస్‌పి వంటి పార్టీలను కలుపుకోవలసిన అవసరాన్ని అసలే గుర్తించలేదు. లోక్‌సభ ఎన్నికలలో సిపిఎంకు సీటే కేటాయించకపోయినా ఓట్ల చీలిక నివారించడం కోసం పోటీ చేయకుండానే మద్దతునిచ్చింది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలలోనూ అనేక విమర్శల తర్వాత మూడు స్థానాలకు అంగీకరించి మళ్లీ ఒకచోట పోటీ పెట్టింది కాంగ్రెస్. దహను, సోలాపూర్, కల్యాన్‌లలో సిపిఎం పోటీ చేస్తుండగా. సేన, ఎన్‌సిపి మూడు చోట్ల మద్దతునిచ్చినా సోలాపూర్‌లో కాంగ్రెస్ పోటీ చేసి బిజెపి గెలవడానికి కారణమైంది. సిపిఎం దహను స్థానంలో పదోసారి విజయం సాధించడం ఒక విశేషం. ఎస్‌పి విషయంలోనూ ఇదే జరిగింది. లోక్‌సభ ఎన్నికలలో గెలుపు తర్వాత కాంగ్రెస్ చూపంతా ముఖ్యమంత్రి పీఠంపైనే వుండి కూటమి భాగస్వాములను కించపర్చింది. లోక్‌సభ ఎన్నికల్లో ముందుగా సర్దుబాట్లు పూర్తయిన రాష్ట్రం మహారాష్ట్ర కనుకనే ఫలితాలు స్పష్టంగా వచ్చాయి. కానీ ఈసారి హర్యానా తప్పులను పునరావృతం చేసింది కాంగ్రెస్. అక్కడా ఎస్‌పి, ఆప్‌లను అసలు కలుపుకోలేదు.

# ఏడాది పాలన ఎటు?




తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతోంది. రాష్ట్ర విభజన తర్వాత తొమ్మిదిన్నరేళ్లు ప్రతిపక్షానికే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో రేవంత్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారని చెప్పవచ్చు. ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న తన లక్ష్యాన్ని కూడా ఆయన నెరవేర్చుకున్నారు. అనూహ్యంగా ప్రతిపక్షానికి పరిమితమైన భారత రాష్ట్ర సమితి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. గతంలో మంత్రి పదవి చేపట్టిన అనుభవం కూడా లేని రేవంత్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను ఇప్పుడు సమీక్షించుకుందాం! పార్టీలో ఎంతో మంది సీనియర్లు ఉన్నప్పటికీ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టుబట్టి మరీ రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారు. ఆ పదవిపై ఆశలు పెట్టుకున్న భట్టి విక్రమార్క, ఉత్తమకుమార్ రెడ్డి వంటివారు సర్దుకుపోవాల్సిన పరిస్థితి. రేవంత్‌రెడ్డి కూడా పార్టీలో తనపై అసంతృప్తి ఏర్పడకుండా సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్టీ పరంగా రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వపరంగా ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో మాత్రం కొంత విఫలమయ్యారని మాత్రం చెప్పవచ్చు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ప్రజల్లో అంచనాలు అమాంతం పెరిగాయి. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చింది. అయితే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కేసీఆర్ ఉన్నప్పుడే క్షీణించింది. దీంతో పాత పథకాలతో పాటు కొత్త పథకాల అమలుకు నిధుల కొరత ఏర్పడింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దూకుడుగా వ్యవహరించడాన్ని ప్రజలు హర్షిస్తారుగానీ ప్రభుత్వాధినేతగా ఆచితూచి వ్యవహరించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడం వల్ల రేవంత్‌రెడ్డి కొన్ని సమస్యలను కొని తెచ్చుకున్నారు. రైతులకు రుణ మాఫీ అమలు విషయంలో ముఖ్యమంత్రి తొందరపడ్డారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పన్నిన ఉచ్చులో రేవంత్ చిక్కుకున్నారు. పాత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూ కొత్త పథకాల అమలుకు పూనుకుంటే ప్రజలు హర్షిస్తారుగానీ, అమలులో ఉన్న పథకాలను నిలిపివేసి కొత్తగా ఎన్ని పథకాలు అమలు చేసినా ప్రజలు సంతృప్తి చెందరన్న మౌలిక సూత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించారు. అందుబాటులో ఉన్న నిధులన్నింటినీ రైతు రుణ మాఫీకి మళ్లించడం వలన పాత పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా రైతు భరోసా వంటి పథకాల అమలు నిలిచిపోయింది. దీనిపై ప్రజల్లో, ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ పరిస్థితిని గ్రహించిన రేవంత్‌రెడ్డి రైతు భరోసా ఇవ్వటానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పెదవి విరవడానికి పెన్షన్ల పెంపు వంటి హామీలతోపాటు అభివృద్ధి పథకాల అమలు నిలిచిపోవడం కూడా కారణంగా కనిపిస్తోంది. అనేక నీటి పారుదల ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా నిలిచిపోయాయి. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యం లోపించడంతో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కోసం వెతుక్కోవలసిన పరిస్థితి! కేసీఆర్ పాలనలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు కూడా చెల్లింపులకు నోచుకోలేదు. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం మందగించింది. ఈ కారణాల వల్ల ప్రజల వద్ద నగదు చెలామణీ తగ్గిపోయింది. ఫలితంగా ప్రజల్లో ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ లోపించింది.

**ఏడాదిలోనే ఎందుకీ మార్పు...**

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొత్తలో ఆయన వ్యవహార శైలి పట్ల ప్రజల్లో మంచి స్పందనే వచ్చింది. అయితే ప్రభుత్వాధినేతగా నిర్ణయాలు తీసుకొనే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించడంతో ఆయన విమర్శలను కొని తెచ్చుకుంటున్నారు. ఉదాహరణకు 'హైడ్రా' ఏర్పాటు! చెరువులు, కుంటల పరిరక్షణకు హైడ్రా ఏర్పాటును అందరూ స్వాగతించారు. ఎప్పుడయితే పేదలు, మధ్యతరగతి వాళ్లు నిర్మించుకున్న, కొనుగోలు చేసిన ఇళ్లను కూల్చే ప్రయత్నం జరిగిందో అప్పటి నుంచి హైడ్రాపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ఫాం హౌజ్‌లను కూల్చివేసినప్పుడు స్వాగతించిన వాళ్లు సామాన్య ప్రజల ఇళ్ల జోలికి వచ్చేసరికి వ్యతిరేకించారు. అదే సమయంలో మూసీ ప్రక్షాళన తెరమీదకు రావడంతో ప్రజల్లో ప్రభుత్వంపై అపోహలు నెలకొన్నాయి. మూసీ ప్రక్షాళన%-% హైడ్రా వంటి ఆపరేషన్లను ఒకే పర్యాయం అమలు చేయాలనుకోవడమే ప్రభుత్వం చేసిన తప్పు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆరేడు నియోజకవర్గాలకు సాగునీరు అందించే మూసీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందిగానీ, మొదటగా మూసీకి ఇరువైపులా ఉన్న ఇళ్లను కూల్చివేయబోతున్నట్టుగా వాటిపై ఎరుపు రంగు అక్షరాలతో మార్కింగ్ చేయించడం మరో తప్పిదం. నిజానికి ఈ చర్యకు హైడ్రాతో సంబంధం లేదు. అయినా హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలు జరగబోతున్నాయన్న ప్రచారం జరిగింది. దీంతో మూసీ ప్రక్షాళనను ప్రజలు అపార్థం చేసుకున్నారు. నిజానికి ప్రభుత్వం కూడా ముందుగా అక్రమణల తొలగింపు జోలికి వెళ్లకుండా ఉండాల్సింది. పై నుంచి, కింది నుంచి మూసీ ప్రక్షాళన పనులు చేపట్టి ఉంటే ఈ ప్రాజెక్టును ప్రజలు అర్థం చేసుకొని స్వాగతించే వారు. సినిమాల్లో చూపించినట్టుగా ముఖ్యమంత్రిగా క్షణాల్లో అద్భుతాలు సృష్టించలేమన్న వాస్తవాన్ని రేవంత్‌రెడ్డి గ్రహించాలి. లక్ష్యం ఎంత మంచిదైనా దాన్ని చేరుకోవడానికి ఎంచుకొనే మార్గం కూడా ఉన్నతంగా ఉండాలి. ప్రభుత్వం అంటే ప్రతిపక్షాల నుంచి రాజకీయ చికాకులు ఎదురవడం సహజం. మూసీ ప్రక్షాళన, హైడ్రా ప్రాజెక్టు విషయంలో కూడా రాజకీయం మొదలైంది. ముఖ్యమంత్రి దుందుడుకుగా వ్యవహరించడమే అందుకు కారణం. దీంతో ప్రభుత్వాధినేతగా రేవంత్‌రెడ్డి పరిణతితో వ్యవహరించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# మనమూ ఆలోచించాలి!

మనకు జబ్బు చేస్తే డాక్టరు దగ్గరకెళ్తాం. మందులు వాడతాం. మొన్న కరోనా వైరస్ విజృంభించి దాడి చేస్తే ప్రపంచమంతా వణికిపోయి, ఎన్ని జాగ్రత్తలు తీసుకొందో.. ఆఖరుకు వ్యాక్సిను కనుగొని నివారించుకున్నాం. లెక్కలేనన్ని బాక్టీరియాలు, వైరస్‌లు నిత్యం మనపై దాడి చేయటం, వాటిని తరిమి ఆరోగ్యాన్ని రక్షించుకోవడం ఒక జీవన పోరాటం. ఇవన్నీ కూడా మనకు తెలిసి, కనపడుతూన్న శత్రు దాడులు. అందుకే అరికట్టే ఆయుధాలను సమకూర్చుకుంటాము. కానీ కనపడకుండా మన మనసుపై, శరీరంపై దాడి చేస్తూ భవిష్యత్తునంతా ఛిద్రం చేస్తున్న వైరస్సు మన ఆహ్వానం మేరకే వచ్చి తన ప్రతాపాన్ని చూపెడుతున్నది. అదే సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా). ఇది వైరస్ కన్నా ప్రమాదకరమైనదే. కొన్ని తరాలనే నిర్వీర్యులను చేస్తున్నది. నిస్సత్తువకూ, మానసిక దౌర్భల్యానికి గురిచేస్తున్నది. మిత్రునిలా దరిచేరి, శత్రువులా కబళిస్తున్నది.



అది గమనించిన ఆస్ట్రేలియా సర్కారు, ప్రపంచంలోనే మొట్టమొదటిగా మేల్కొన్నది. వారి పార్లమెంటు ఒక మంచి నిర్ణయం తీసుకుంది. శారీరక, మానసిక ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని పదహారు ఏండ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాలను నిషేధిస్తూ ఒక బిల్లును ఆమోదించింది. ఇదొక సాహసోపేతమైన చర్యనే. పిల్లల వయసుకు సంబంధించి సోషల్ మీడియా వేదికలు హేతుబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం సూచించింది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, రెడిట్ మొదలైన అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఈ నిషేధం వర్తిస్తుందనీ పేర్కొంది. అయితే ఈ నిషేధిత జాబితాలో యూట్యూబ్‌ను మినహాయించింది. వయసు నిబంధన కఠినంగా అమలుపరచాలనీ, సోషల్ మీడియాలో పిల్లలు ఖాతాలు ఆరంభించకుండా నిరోధించకపోతే, సంబంధిత వేదికలకు 280 కోట్లు జరిమానాగా విధించుతారని చట్టం పేర్కొంది. ఆ దేశ ప్రధాని ఆంటోనీ అల్బనేసే మాట్లాడుతూ, విపరీతంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న కారణంగా పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యం చాలా ప్రభావితమవుతోందని, అందువల్లనే ఈ నిషేధ చట్టం తెచ్చామని తెలపడం, మనమంతా కూడా ఆలోచించాల్సిన విషయం. చేతిలోకి సెల్‌ఫోన్లు వచ్చాక వివిధ సోషల్ మీడియా వేదికలు అనేకానేక చర్చలకు, అవాస్తవ, అశాస్త్రీయ, భ్రమాత్మక విషయాలకు వేదికగా మారిపోయాయి. ముఖ్యంగా యువత, పిల్లలు వాటికి అలవాటుపడిపోయి, ఇంకే విషయాలనూ, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, పనులను, సమస్యలనూ పట్టించుకోకుండా పోయింది. మొత్తం 24 గంటల్లో అనేక గంటలు ముఖాన్ని కదలకుండా స్క్రీన్‌పై పెట్టడం, వేళ్లతో చాటింగ్‌లూ చేయటంలోనే మునిగిపోవటంవల్ల, శారీరకమైన రుగ్మతలు తలెత్తుతున్నాయి. అనవసరమైన, ఎందుకూ పనికిరాని చెత్తంతా మెదళ్ళపై చేరుతున్నది. ఇప్పటికే పిల్లలు ఘోరమైన గేమ్స్ వీడియోలు చూడటంవల్ల, వారి మానసిక పరిస్థితి హింసాత్మకంగా స్పందనా రహితంగా మారుతోందని మానసిక వైద్యులు వెల్లడిస్తున్నారు. చూపు మందగిస్తోంది. శారీరక కదలికలు, ఆటలు కరువై ఎదుగుదల కూడా ఆగిపోతున్నది. అంతేకాక సోషల్ మీడియాలో వచ్చే విషయాలు, సమాచారమే వాస్తవమైనదని భావించి అనేక అపోహలకు గురవుతున్నారు. ఇది భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇక చూడటం అలవాటయిన తర్వాత చూడకుండా ఉండలేనితనం పెరిగింది. అందుకనే పిల్లలు సెల్‌ఫోన్ల కోసం, యాప్‌ల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. మానసిక రోగులుగా మారిపోతున్నారు. ఒంటరులవుతున్నారు. దొంగతనాలకు, దోపిడీలకు పాల్పడుతున్నారు.

పిల్లలను చైతన్యరహితులుగా, నిస్తేజులుగా తయారు చేయటమే కాకుండా, మానసిక అనారోగ్యానికి గురిచేస్తున్న, శారీరక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తున్న ఈ సోషల్ మీడియాను 16 ఏండ్లలోపు పిల్లలకు దూరంగా ఉంచడం చాలా అవసరమైన చర్య. ఇది చాలా చిన్న విషయంగా అనిపించవచ్చు. కానీ భవిష్యత్ తరాలకు, వారి క్షేమానికి సంబంధించినది. ఆస్ట్రేలియా దేశం చేసినట్టుగానే మన దేశమూ చేయాలి. తల్లిదండ్రులు ఈ విషయమై ఆలోచించి ప్రభుత్వాల ముందుకు నిషేధ డిమండును తీసుకురావాల్సి ఉంది. ప్రభుత్వాలూ భావితరాల బాగుకోసం బాధ్యతగా ఆలోచన చేయాలి.

తరంగాలు Tharangalu Daily News Paper RNI. TELTEL/2022/83463

# బొల్లమల్ల నర్సింగ్ రావుకు గౌరవ డాక్టరేట్





## -నిస్వార్థ సేవకు దక్కిన అరుదైన గౌరవం

**కుత్బుల్లాపూర్,1డిసెంబర్(తరంగాలు):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కు చెందిన నర్సింగ్ సామాజిక సేవలను గుర్తించిన అమెరికన్ యూనివర్సిటి ఫర్ గ్లోబల్ పీస్ ముంబైలో ప్రొఫెసర్ మధు క్రిషన్ చేతుల మీదుగా నర్సింగ్ రావు డాక్టరేట్ అవార్డు పొందా రు.నిస్వార్థ సమాజ సేవకుడికి అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ సమాజ సేవకులు, మాల మహానాడు రాష్ట్ర సెక్రటరీ జనరల్, సీనియర్ జర్నలిస్ట్ బొల్లమల్ల నర్సింగ్ రావు చేస్తున్న సామాజిక సేవలను అమెరికన్ యూనివర్సిటి ఫర్ గ్లోబల్ పీస్ గుర్తించింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో అమెరికన్ యూనివర్సిటి ఫర్ గ్లోబల్ పీస్ అంబాసడర్, చైర్మన్ అండ్ చీఫ్ రెక్టర్ ఆఫ్ ఏయుజీపీ, ఎమినెంట్ సైంటిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ మధు క్రిషన్ చేతుల మీదుగా బొల్లమల్ల నర్సింగ్‌రావు ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అవార్డు పొందారు. హెూలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ రౌత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ డాక్టర్ మధు క్రిషన్‌తో పాటు ఫరాబీ కజఖ్ నేషనల్ యూనివర్సిటి ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డేమ్ తత్యానమాల్, శ్రీలంక మెడిసిన ఆల్టర్‌నేటివ డైరెక్టర్‌లు రోషన్ మద్దుమగె, సుగత్ కోటిన్‌కదువలు పాల్గొన్నారు.దళిత కుటుంబంలో జన్మించిన బొల్లమల్ల నర్సింగ్‌రావు చిన్నతనం నుండే ఎన్నో కష్టనష్టాలకోర్చి జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ.. ఎదుగుతూ సమాజంలో ఉండే పేదవారి,అభాగ్యుల పట్ల ఎంతో కరుణ కలిగి ఉండేవారు. తనకు తోచిన విధంగా పేదలకు సాయం చేస్తుంటారు. కరోనా సమయంలో సైతం పేదలకు నిత్యావసర సరుకులు, ఆహారం, పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతూ పలువురి ప్రశంసలు పొందారు. తోటి మనిషికి సాయం చేయాలనే తపన నర్సింగ్ రావులో చిన్నతనం నుండే ఉండేదని ఆయన బంధువులు, స్నేహితులు చెబుతుంటారు.అంతేకాక నర్సింగ్‌రావు మాల మహానాడు రాష్ట్ర నాయకులుగా పనిచేస్తూ దళితులకు ఎలాంటి ఆపద వచ్చినా తాను ముందుండి పోరాడతారు. పాత్రికేయ రంగంలో కూడా అందరి మన్ననలు పొందారు. నర్సింగ్‌రావు ఒక ప్రకటనలో స్పందిస్తూ తనకు ఈ డాక్టరేట్ అవార్డు ఇవ్వడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని, తన సేవలను గుర్తించి డాక్టరేట్ అవార్డును ప్రధానం చేసిన అమెరికన్ యూనివర్సిటీ ఫర్ గ్లోబల్ పీస్ సంస్థకు, ప్రొఫెసర్ డాక్టర్ మధు క్రిషన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రతీ ఒక్కరూ సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, నిరుపేదలకు, అభాగ్యులకు మనకు తోచిన విధంగా సహాయం చేయాలని నర్సింగ్‌రావు సూచించారు.అదేవిధంగా తనకు అండగా నిలిచిన ప్రతీ ఒక్కరికి నర్సింగ్‌రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వరికోత మిషన్ పై ప్రమాదంలో డ్రైవర్ మదన్ దుర్మరణం



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 1(తరంగాలు):** మిర్యాలగూడ మండలంలోని లక్షీపురం గ్రామ శివారులో జరిగిన విషాదకర ఘటనలో డ్రైవర్ పొంగు మదన్ (23) ప్రాణాలు కోల్పోయారు. మదన్, తండ్రి శ్రీను, కులం మాదిగ, డ్రైవింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శనివారం(30-11-2024) వరికోత మిషన్ డ్రైవర్‌గా లక్షీపురం గ్రామంలోని పాతకోటి శ్రీను కౌలుకు చేస్తున్న వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా, సుమారు సాయంత్రం 3 గంటలకు టీఎస్ 05 యుబి 076 నంబర్ గల ఐషర్ ట్రాక్టర్‌ను నడుపుతుండగా ప్రమాదవశాత్తుగా అదుపుతప్పి క్రిందపడిపోయాడు. ట్రాక్టర్ ట్రాల్లి టైరు మదన్ తలమీదుగా వెళ్లిపోవడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు.మృతుని భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మదన్‌కు భార్యతో పాటు ఇద్దరు కొడుకులు ఉన్నారు.ప్రస్తుతం ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతుందని మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పి.లోకేష్ తెలిపారు.

# విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు



**కేసముద్రం, డిసెంబర్ 1( తరంగాలు)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్ పునరుద్ధరింప దగిన శక్తి వనరులు అనే అంశం మీద ఆదివారం కేసముద్రం మండల స్థాయి వ్యాసరచన పోటీలు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం స్టేషన్ లో నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి కాలేరు యాదగిరి తెలిపారు. ఈ వ్యాసరచన పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం స్టేషన్ కు చెందిన ఎం.డి. అఫ్ర నిఖ?త్ మొదటి స్థానం సాధించినట్లు, ఈ విద్యార్థిని ఈనెల 2 వ తేదీన జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు, పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రోత్సాహక బహుమతులు, స్వీట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం విలేజ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చీకటి వెంకట్రామనర్సయ్య, మండల విద్యావనరుల కేంద్రం ఎం.ఐ.ఎస్. కో ఆర్డినేటర్ షేక్ ఖాదర్, ఉపాధ్యాయులు లక్ష్మీకుమారి, సుష్మ, మోహనకృష్ణ, రామరాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది సమస్యలు ఏమైనా నాకు తెలియజేయండి..

## ఎమ్మెల్యే -బి ఎల్ ఆర్



**మిర్యాలగూడ ఆర్సీ, నవంబర్ 1(తరంగాలు):** దామరచర్ల మండలం వాచ్య తండాలో గల తెలంగాణ ఆదర్శ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి - బి ఎల్ ఆర్ విద్యార్థులతో కలిసి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులు అందరికీ నాణ్య మైన పౌష్టిక ఆహారం అందించాలనే లక్ష్యంగా మెస్ చార్జీలు పెంచారు కావున విద్యార్థులు అందరూ మంచిగా తిని మంచిగా చదువుకొని సమాజానికి, మీ తల్లితండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చే విధంగా ఉండాలి అని అన్నారు.అలాగే ఆహారం విషయంలో గానీ బుక్స్ విషయంలో గానీ మీకు ఎలాంటి అవసరాలు ఉన్నా, ఎలాంటి సమస్యలు ఉన్నా నాకు నేరుగా తెలియజేయండి నేను మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ నిన్న అధికారులతో నిర్వహించిన తనిఖీల్లో నియోజకవర్గంలో ఉన్న అన్ని హాస్టల్స్ లో ఈ హాస్టల్ పైనే ఫిర్యాదులు వచ్చాయి.కావున మరలా ఫుడ్ విషయంలో ఎలాంటి నాణ్యత రహితంగా ఉన్నట్టు విద్యార్థుల నుంచి గానీ మేము సందర్శించినప్పుడు గానీ మాకు తెలిసినచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరియు బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# మహా అన్న ప్రసాద వితరణలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 1(తరంగాలు):** మిర్యాలగూడ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో 12వ రోజు నిర్వహించిన మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. స్వాములకు అన్న ప్రసాదం పంపిణీ చేసి, స్వాముల సేవలో నిమగ్నమయ్యారు.అనంతరం స్వాములతో మాట్లాడి కార్యక్రమంలో ఉన్న సౌకర్యాల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ సభ్యులు కూడా పాల్గొన్నారు.ఈ మహోత్సవంలో పాల్గొన్న వారంతా భక్తి భావంతో స్వామి ఆశీస్సులు పొందారు.

# నేనావత్ భజన నాయక్ చిత్రపటానికి ఘన నివాళులు





**మిర్యాలగూడ ఆర్సీ,డిసెంబర్ 1(తరంగాలు):** అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామపంచాయతీ బాలాజీ నగర్ తండాకు చెందిన నేనావత్ భజన నాయక్ (60 సంవత్సరాలు) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే మరియు బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లమోతు భాస్కర్ రావు ఆదివారం వారి నివాసానికి వెళ్లి, భజన నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం భజన నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు డిసిఎంఎస్ నల్గొండ జిల్లా వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, తాజా మాజీ జెడ్పిటిసి ఆంగోతు లలిత హాతిరాం నాయక్, అడవిదేవులపల్లి మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కొత్త మల్రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను నాయక్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, కాశయ్య, నాగేశ్వరరావు, కొట్య నాయక్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.భజన నాయక్ సేవలను గుర్తుచేసుకుంటూ, వారి కుటుంబానికి భాస్కర్ రావు మద్దతు ప్రకటించారు.

# పదవీవిరమణ సన్మానం

## -వరలక్ష్మి సేవలకు మాజీ ఎంఎల్సీ పూల రవీందర్ ప్రశంసలు



**మిర్యాలగూడ ఆర్సీ,డిసెంబర్ 1(తరంగాలు):** 28 సంవత్సరాలు వివిధ పాఠశాలల్లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా విద్యాసేవలందించిన గౌరు వరలక్ష్మి పదవీవిరమణ సందర్భంగా ఆమె నివాసంలో మాజీ ఎంఎల్సీ పూల రవీందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,విద్యావ్యాప్తికి వరలక్ష్మి మరియు ఆమె భర్త శ్రీపతి శ్రీనివాస్ నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లేందుకు నిరంతరంగా కృషి చేశారు. వారి సేవలు ఆదర్శప్రాయమైనవి అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు. మిర్యాలగూడ అధ్యక్షులు రాంరెడ్డి, రూరల్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, అడవిదేవులపల్లి అధ్యక్ష కార్యదర్శులు కిషోర్ నాయక్, రంగారెడ్డి, శ్రీనివాసరావు, దామరచర్ల అధ్యక్షుడు అశోక్, వేములపల్లి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, త్రిపురారం అధ్యక్షులు సత్యనారాయణ, రాష్ట్ర భాధ్యులు గోపినాయక్, మామిళ్ల శ్రీనివాసరెడ్డి, విష్ణు, నరసింహనాయక్, అంబటి శ్రీను, వెంకట్, జానపాటి శ్రీను, యాదగిరిరెడ్డి, వెంకటరెడ్డి, కాషియాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉద్విగ్నంగా జరిగి,వరలక్ష్మి చేసిన సేవలను గుర్తించి, ఈ ప్రాంతంలోని విద్యారంగానికి వారు అందించిన కృషి గురించి ప్రశంసల వెల్లువలతో ముగిసింది.

# డాక్టర్.శరత్ బాబు ఆధ్వర్యంలో ఆహ్వాన హెూమం,శివాభిషేకం





**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 1(తరంగాలు):** మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ సరస్వతి ఆలయం నందు ఆదివారం కార్తీక మాసం చివరిదినం సందర్భంగా సర్వదేవతల ఆహ్వాన హెూమం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు శివాభిషేకం కార్యక్రమం వైద్యుడు డాక్టర్. తీపిరినేని శరత్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి నల్లమోతు భాస్కర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ దేవతల ఆహ్వాన హెూమం మరియు శివాభిషేకం కార్యక్రమాలు ప్రజల సమాజం కోసం, ఆత్మిక శాంతి కోసం నిర్వహించబడుతున్నవి. ప్రజలందరూ సుఖశాంతులతో, సుబిక్షంగా జీవించాలని, ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని, వెంకటేశ్వర స్వామి యొక్క దయ ప్రజలపై ఉండాలని ఈ హెూమం ద్వారా ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో రామ్మూర్తి, ఆలయ అర్చకులు, ఇతర ప్రముఖ నాయకులు తదితరులు కూడా పాల్గొన్నారు.డాక్టర్. తీపిరినేని శరత్ బాబు ఈ గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ఆయా కార్యక్రమం విజయవంతంగా సాగింది.

తరంగాలు

# రియల్ భూములకు రెక్కలు

**-జైపూరు మండలంలో జోరందుకుంటున్న రియల్ దందా**


**-ఫ్లాట్ల కొనుగోలుకు మొగ్గు చూపుతున్న జనం**



**చెన్నూర్, డిసెంబర్ 01. (తరంగాలు):** నాగపూర్, విజయవాడ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి మొదటి విడత మంచిర్యాల- వరంగల్ రహదారి పనులు శుక్రవారం రోజున మొదలవగా, జైపూర్ మండలంలోని ఇందారం, టేకుమట్ల, రసూల్ పల్లి, నర్వ గ్రామాల్లో రియల్ దందా జోరందుకుంది. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి ప్రకటన చేసిన అనతి కాలంలోనే కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు కోట్లాది రూపాయలు వెచ్చించి, భూములు కొనుగోలు చేసి, వెంచర్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో రహదారి భూసేకరణకు అడ్డంకుల కారణంగా రహదారి పనులు నిలిచిపోగా, రియల్ వ్యాపారులు ఆశలపై నీళ్లు జల్లినట్లయింది. ఇటీవలే రహదారి పనులకు సేకరించిన భూములను స్వాధీనం చేసుకొని, అధికారులు రహదారి పనులు మొదలుపెట్టగా, విషయం తెలుసుకున్న జనం శని, ఆదివారాల్లో ఫ్లాట్ల కొనుగోలు చేసేందేకు ఎగబడుతున్నారు. మండలంలోని 12 గ్రామాల్లో దాదాపు 20 కిలోమీటర్లు జాతీయ రహదారి నిర్మాణం కావాల్సి ఉండగా, మండలంలోని పలు గ్రామాలలో భూములకు ఒక్కసారిగా రెక్కలు రాగా, ఓ పక్క రియల్ వ్యాపారులు భూములు కొనుగోలు చేస్తూ రియల్ దందా విస్తరించుకునే ప్రయత్నాలు చేస్తుండగా, మరోపక్క ఇంకొద్ది రోజుల్లో రానున్న రోజుల్లో భూముల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉంటాయేమోనని జనాలు ఫ్లాట్ల కొనుగోలుకు జైపూర్, టేకుమట్ల, రసూల్ పల్లి, నర్వ గ్రామాల్లోని వెంచర్లను ఆశ్రయిస్తున్నారు.

# జ్యోతిబాపూలే భవనంలో పోలీస్ కృష్ణయ్య ముదిరాజ్ 15వ వర్ధంతి






**-తెలంగాణ తొలి అమరుడికి జోహార్లు**

**మిర్యాలగూడ ఆర్సీ,డిసెంబర్ 1(తరంగాలు):** మిర్యాలగూడ పట్టణం జ్యోతిబాపూలే భవనంలో బీసీ భవనంలో, తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు పుట్టకొక్కుల పోలీస్ కృష్ణయ్య ముదిరాజ్ 15వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక నివాళి కార్యక్రమం జరిగింది. డిసెంబర్ 1, 2024 ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలనతో నివాళులు అర్పించడమై, అమర హై పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ నినాదాలతో జోహార్లు ఘట్టం కొనసాగింది. ఈ కార్యక్రమానికి బీసీ జేఏసీ కో కన్వీనర్ దాసరాజు జయరాజు ఆధ్వర్యం వహించగా, ముఖ్య వక్తగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ కోలా సైదులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడిగా పోలీస్ కిష్టయ్య ని గుర్తించి, జయంతి, వర్ధంతులను అధికారికంగా జరపాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి,అని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా నాయకులు బంటు సైదులు పాల్గొనగా, ఇతర ప్రముఖులుగా శిరసనగండ్ల ఈశ్వర చారి, కొంక వెంకన్న ముదిరాజు, నల్లగంతుల నాగభూషణం, చేగోండి మురళి యాదవ్, సింగు రాంబాబు, వెంకటేశ్వర్లు, సలికలాపురం యాదగిరి, జలనీల రాజశేఖర్, కోయిలకొండ నారాయణ తదితరులు పాల్గొన్నారు. పోలీస్ కృష్ణయ్య ముదిరాజ్ సేవలను స్మరించుకుని, తెలంగాణ ఉద్యమంలో వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, సమాజం ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయం సాధించి, ప్రజల హృదయాలను అలరించింది.

# సీపీఎం జిల్లా 21వ మహాసభలు

# జిల్లా సమగ్రాభివృద్ధి కోసం బలమైన పోరాటాలు

**-బహిరంగ సభ కు వేలాదిగా తరలిరావాలి**

**-విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి**



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 1(తరంగాలు):** జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తులో బలమైన పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేస్తామన్నారు. దీనికోసం మిర్యాలగూడలో జరిగే సిపిఎం 21వ జిల్లా మహాసభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు. గత మూడు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించామని, పాదయాత్ర చేపట్టామని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రాజెక్టుల సందర్శన చేపట్టామని చెప్పారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వీటి పరిధిలో ఉన్న మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు. ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. మూసి ప్రాజెక్ట్ పునరుద్ధరించాలని కోరారు. జిల్లాలో 17 మండలాలు పెండింగ్లో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కూలి దినాలు పెంచాలని రోజు కనీసం 600 రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు దీని కోసం చట్టం చేయాలన్నారు. బడ్జెట్లో నిధులు పెంచాలని కోరారు. గతంలో సిపియం పార్టీ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు ప్రజా ఉద్యమాలపై సుదీర్ఘంగా చర్చించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలి నేడు మిర్యాలగూడలో జరిగే సిపిఎం మహాప్రదర్శన భారీ బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుండి అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సుమారు 10 నుంచి 15 వేల మందితో ఈ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. దీనికిగాను అని ఏర్పాటు పూర్తి చేశామన్నారు. ఈ బహిరంగ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, మల్లు లక్ష్మి హాజరవుతున్నట్లు తెలిపారు, 3, 4 తేదీలలో స్థానిక బృందావన్ గార్డెన్ లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందని సుమారు 600 మంది ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు సీనియర్ నాయకులు పెన్నా అనంతరామ శర్మ నగర్లో ఈ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 409 శాఖల మహాసభలను పూర్తి చేసుకుందామన్నారు. 4182 మందితో సభ్యత్వం కలిగి ఉందన్నారు. బహిరంగ సభకు అనువర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, భవాండ్ల పాండు, శశిధర్ రెడ్డి, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్ కమ్మంపాటి శంకర్, నాయకులు రొండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా సుచిత్ర లో ఘననివాళి



**కుత్బుల్లాపూర్ తరంగాలు**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుచిత్ర సర్కిల్ లో 132 జీడిమెట్ల డివిజన్ లో ఆదివారం తెలంగాణ అమరవీరుడు పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా గుమ్మడి మధుసూదన్ రాజ్ ముదిరాజ్ తెలంగాణ సీనియర్ ఉద్యమకారుని ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా గుమ్ముల స్వామి ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ ముదిరాజ్ మహాసభ చేతుల మీదుగా నివాళులు అర్పించారు. దమ్మని శివకుమార్ ముదిరాజ్,సాయిలు ముదిరాజ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించిన జాటోత్ హుస్సేన్ నాయక్



**కేసముద్రం, డిసెంబర్ 1, (తరంగాలు)** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని టిటిడబ్ల్యూయుఆర్ జేసి బాలికల పాఠశాలను జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రుచికరమైన భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే టీచర్స్ అందుబాటులో ఉంటున్నారా వివరాలను సేకరించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ ఎర్రయ్య, ఎంపీడీవో క్రాంతి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా మహిళ మృతి



**కేసముద్రం, డిసెంబర్ 1( తరంగాలు)** కేసముద్రం మండల కేంద్రంలోని ఉప్పరపల్లి రోడ్డు లక్ష్మీ నగర్ లో నివాస ఉంటున్నటువంటి బత్తుల అనూష(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం అనూష మరణానికి తన భర్తే కారణమని ఆరోపిస్తున్నారు. కాగా పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నల్గొండ ప్రీమియర్ లీగ్ ప్రారంభం





**మిర్యాలగూడ ఆర్సీ,డిసెంబర్ 1(తరంగాలు):** నల్గొండ పట్టణంలో మాజి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి కుమారుడు ప్రతీక్ రెడ్డి 15వ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. టోర్నమెంట్ ప్రారంభించిన అనంతరం బత్తుల లక్ష్మారెడ్డి క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కొమటిరెడ్డి వెంకటరెడ్డి కుమారుడి జ్ఞాపకార్థం యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి ఈ టోర్నమెంట్ నిర్వహించడం గర్వకారణమన్నారు. ప్రతీక్ రెడ్డి పేరుతో ప్రారంభించిన ఫౌండేషన్ గత 15 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నదని కొనియాడారు. కోమటిరెడ్డి బ్రదర్స్ పేద, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న మహానాయకులుగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల వంటల పోటీలు గ్యాస్ సురక్షిత వినియోగంపై అవగాహన





**మిర్యాలగూడ ఆర్సీ,డిసెంబర్ 1(తరంగాలు):** హెచ్‌పీ, ఇండేను, భారత్ గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో మిర్యాలగూడ కృష్ణ కాలనీ హరివిల్లు అపార్ట్మెంట్లో ఆదివారం మహిళలకు ప్రత్యేక వంటల పోటీలు నిర్వహించారు. గ్యాస్ వినియోగంపై సురక్షిత విధానాలు, 1906 అత్యవసర నెంబర్ ఉపయోగం, గ్యాస్ పొదుపు చర్యలపై మహిళల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో ఈ కార్యక్రమం జరిగింది.పట్టణం మరియు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పోటీల్లో పాల్గొని తమ వంటకాల నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌పీ గ్యాస్ డీలర్ ప్రతాప్ మాట్లాడుతూ, గ్యాస్ వినియోగంలో నిర్లక్ష్యం ప్రమాదకరమని, సురక్షిత వినియోగానికి గ్యాస్ పైపులు, రెగ్యులేటర్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. గ్యాస్ స్టవ్ సమస్యలను స్వయంగా రిపేర్ చేయకుండా, ఏజెన్సీ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 1906 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని ఆయన వివరించారు.పోటీలను న్యాయ నిర్ణేతగా గుడిపాటి అనిత నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతల వివరాలు: 1. ఆర్. సునీత – ప్రథమ బహుమతి 2. ఎస్. సరిత – ద్వితీయ బహుమతి 3. పి. మాధవి – తృతీయ బహుమతి

ఈ కార్యక్రమంలో గుడిపాటి నవీన్, నరేందర్, విజయ్ కుమార్, భాగ్యలక్ష్మి, పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# నిట్ 22వ స్నాతకోత్సవం

**-ముఖ్య అతిథిగా డి ఆర్ డి ఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ కామత్**



**హన్మకొండ ప్రతినిధి /తరంగాలు**

వరంగల్ ఎన్ఐటి 22వ స్నాతకోత్సవానికి డిఆర్డిఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ కామత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1875 మంది విద్యార్థులకు డిగ్రీలు, 11 మంది విద్యార్థులు బంగారు పతకాలు, ఉత్తమ పి హెచ్ డి థీసిస్, పిజీ అవార్డులు అంద చేశారు. డాక్టర్ సమీర్ కామత్ ఇన్స్టిట్యూట్ హెల్త్ సెంటర్ను ప్రారంభించారు. వరంగల్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శనివారం అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్లో 22వ స్నాతకోత్సవం నిర్వహించారు. సెక్రటరీ, డైరెక్టరేట్ ఆఫ్ డిఫెన్స్ ఆర్అండ్. డిఆర్డిఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ 22వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ గీతం అనంతరం వరంగల్ ఎన్ఐటీ ఛైర్పర్సన్, డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి కాన్వొకేషన్ను ప్రారంభించి కాన్వొకేషన్ నివేదికను సమర్పించారు. ఈ కాన్వొకేషన్లో 1875 విద్యార్థులు పట్టాలు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నలుగురు అధ్యాపకులకు పరిశోధన విశిష్ట పురస్కారాలు లభించాయి. విధుల నిర్వహణలో నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇన్స్టిట్యూట్ సిబ్బంది అవార్డులను ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరం నుండి, పీజీ, పి హెచ్ డి విద్యార్థులకు ఉత్తమ థీసిస్ అవార్డులు ఏర్పాటు చేయబడ్డాయి. ఇన్స్టిట్యూట్ 54.72 కోట్ల విలువైన ప్రాజెక్టు, 4.19 కోట్ల విలువైన కన్సల్టింగ్ గ్రాంట్లను పొందింది. గ్రాంట్లు అందించడం, పరిశ్రమలతో సహకారాన్ని ప్రోత్సహించడం ద్వారా స్టార్టప్ ను ప్రారంభించేందుకు అధ్యాపకులు, విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. క్యాంపస్ ప్లేస్మెంట్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 300 కంపెనీలు క్యాంపస్ ని సందర్శించాయి. గతేడాది అత్యధికంగా 88 లక్షల ప్యాకేజీ అందించారు. పూర్వ విద్యార్థుల ఉదార సహకారంతో 2.3 కోట్ల ఎండోమెంట్ ఫండ్ స్థాపించబడింది. డాక్టర్ సమీర్ వి కామత్ స్నాతకోత్సవ గ్రాడ్యుయేట్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వరంగల్ నిట్ పూర్వ విద్యార్థులు డిఆర్డిఓ తో సహా ప్రపంచవ్యాప్తంగా విభిన్న పాత్రలకు సహకరిస్తున్నారు. గాడ్యుయేట్లను, పతక విజేతలను ఆయన అభినందించి ప్రసంగాన్ని ముగించారు. ఈ సంవత్సరం కాన్వొకేషన్లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్కి చెందిన మంజిమా కర్మాకర్ ఇన్స్టిట్యూట్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. మనీషా వర్షినీ, ఎంసిఏ, అన్ని పిజీ ప్రోగ్రామ్లలో టాపర్ గా నిలిచి బంగారు పతకాన్ని అందుకున్నారు. కెమిస్ట్రీలో అరుణ్ కుమార్ ఉత్తమ పీహెచ్ఎ థీసిసికి రోల్ ఆఫ్ హనరు అందుకున్నారు. అంతకుముందు, డాక్టర్ సమీర్ వి కామత్,ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి,డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ నిర్వాహకుల సమక్షంలో, ఇన్స్టిట్యూట్ హెల్త్ సెంటర్ను ప్రారంభించారు.10 పడకల ఎమర్జెన్సీ వార్డు, లాబొరేటరీ, ఫిజియోథెరపీ, ఫార్మసీ బ్లాక్ లో ఉంటాయన్నారు. ఈ సౌకర్యం ఇన్స్టిట్యూట్లోని విద్యార్థులకు, సిబ్బందికి ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

# పోలీస్ కృష్ణయ్య జయంతి వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలి

**-ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె బోయిన అశోక్ డిమాండ్**

**-ఘనంగా నివాళులర్పించిన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బయ్య స్వామి,పులి రజనీకాంత్**



**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 01 (తరంగాలు)**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్య జయంతి వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ అన్నారు.హనుమకొండలోని ఆదాలత్ లో గల అమరవీరుల స్థూపం వద్ద వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్ష,కార్యదర్శులు బయ్య స్వామి,పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని,పోలీస్ కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం సబ్బండ వర్గాలు చేస్తున్నటువంటి ఉద్యమాన్ని చూసి, చల్లించిపోయి,తనంతట తానే కాల్చుకొని తొలి అమరుడయ్యాడని,అలాంటి మా ముదిరాజ్ ముద్దుబిడ్డ జయంతి, వర్ధంతిలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, అప్పుడే తన ఆత్మకు శాంతి చేకూరుతుందని అన్నారు.ముదిరాజు మహాసభ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ కృష్ణయ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.ట్యాంక్ బండ్ పైన పోలీస్ కృష్ణయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని,అలాగే తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడిగా ప్రకటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బుస్సా మల్లేశం, చొప్పరి సోమయ్య,ఎన్నారై రాజకుమార్, దువ్వా నవీన్, చుంచు కృష్ణ,పిట్టల రమేష్, భయ్యా శోభన్,ఇప్ప సాంబమూర్తి, కోరబోయిన రవి,పులి విక్రం,ప్రభాకర్, రోగుల సతీష్,పుట్ట మహేందర్, సంగరబోయిన ఉమేష్,వాసు ,రాజు,శేఖర్,శివ, దేవేందర్, హరికృష్ణ, అశోక్, గోపి,అనురాధ, మహేందర్, విజేందర్, నరేష్, కనకరాజు, రమేష్,చంద్ర,మధుసూదన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళులు






**వర్ధన్నపేట,01డిసెంబర్ (తరంగాలు):** మలి దశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్యకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఆదివారం వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామం గాంధీ నగర్ ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ లో ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య 15 వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో కుల పెద్దలు అమరుడు కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ నాటి మలి దశ ఉద్యమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో సెల్ ఫోన్ టవర్ ఎక్కి తన రివాల్వర్ తో కాల్చుకొని తన ప్రాణాలను త్యాగం చేసి యావత్తు తెలంగాణ ప్రజానీకానికి ఉద్యమ స్ఫూర్తిని రగిలించి అమరుడయ్యారని కొనియాడారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కిష్టయ్య పాత్ర ఎంతో ఉందని తెలిపారు.ఈ ముదిరాజ్ కుల పెద్దలు పిట్టల భాస్కర్,పిట్టల కుమారస్వామి,కొండ ఉప్పలయ్య,మత్స్యశాఖ అధ్యక్షులు సుంకరి స్వామి,ఉపాధ్యక్షులు సుభాష్, కార్యదర్శి భీమరాజు,పండుగ బాబు,పిట్టల ప్రభాకర్,బోల్ల సదానందం, భిక్షపతి,కొమురయ్య, పైడి,యాదగిరి, వీరస్వామి, సీను, కుమారస్వామి, ముదిరాజ్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాపాలన విజయోత్సవాలు


**-వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**



**వరంగల్,1 డిసెంబర్(తరంగాలు):** రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు నేడు (సోమవారం) ఘనంగా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ మధ్య కోట కీర్తి తోరణాల ప్రాంగణంలో నేడు (సోమవారం) సాయంత్రం 5.00 గంటలకు అలేఖ్య రాష్ట్ర కళా బృందంచే జయ జయహే ప్రజాపాలన పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు,జిల్లాలోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పథకాలు, సాధించిన విజయాలను వివిధ కళారూపాల్లో ప్రదర్శిస్తారని వివరించారు.అధిక సంఖ్యలో నగరప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**-కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి**



**పాలేరు ఆర్సీ.01డిసెంబర్(తరంగాలు ):** గత రెండు రోజుల నుండి వాతావరణంలో కొద్దిగా మార్పులు చోటు చేసుకున్నాయి.తుపాను ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందని,అందువల్ల రైతులు అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని, ధాన్యం తడవకుండా చూసుకోవాలని కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి తెలిపారు. ఆరబోసిన ధాన్యాన్ని,ప్రత్తిని తడవకుండా పట్టాలు కప్పుకుని తగు జాగ్రత్తలు తీసుకోగలని రైతులకు సూచించారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షులుగా మేడి బాబు**



**తరంగాలు మఠంపల్లి మండలం ప్రతినిధి**

రఘునాథపాలెం గ్రామం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం నూతనంగా ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా మేడి బాబు ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కార్యవర్గ సభ్యులు కళ్యాణ్ కుమార్ సంసోను కందుకూరి రాజు తుళ్లూరి నాగేష్ పిడమర్తి వీరబాబు గోసంగి చక్రవర్తి ఇట్టి కార్యక్రమంలోఅంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది

## 2 వ నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే కుంగ్ ఫు ఛాంపియన్ షిప్ - 2024

### ప్రారంభించిన వరంగల్ పశ్చిమ ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 01 (తరంగాలు)**
హనుమకొండ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని పదవ డివిజన్ జక్రియ ఫంక్షన్ హాల్ లో 2nd నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే,కుంగ్ ఫు ఛాంపియన్ షిప్ - 2024 ను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ మనిషి యొక్క ఆరోగ్య పరిస్థితికి చాలా మెరుగైన క్రీడ అని అత్యంత స్వీయ సంరక్షణలో మార్షల్ ఆర్ట్స్ (కరాటే,కుంగ్ ఫు)చాలా దోహదపడుతాయని యవ్వన దశలో నుంచే మార్షల్ ఆర్ట్స్ అలవాటు చేసుకోవడం చాలా అవసరం ఉందన్నారు.మనిషి సొంతంగా నేర్చుకుని సంపాదించుకునే ఆస్తి మార్షల్ ఆర్ట్స్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు,డివిజన్ ప్రెసిడెంట్ కుమార్ యాదవ్,జిల్లా కాంగ్రెస్ నాయకులు పల్లం రమేష్,హరి సింగ్,డివిజన్ కార్యకర్తలు సతీష్,రాజు,జఫర్ పాషా,టోర్నమెంట్ చైర్మన్ బండారి సంతోష్,డైరెక్టర్ బండారి నరేష్,దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## సురభి కాలనీవాసులకు అండగా ఉంటా


### శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.



**శేరిలింగంపల్లి, 01డిసెంబర్ (తరంగాలు):**
మౌలిక సదుపాయాల కొరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా.. కార్పొరేటర్. శేరిలింగంపల్లి డివిజన్ లోగల సురభి కాలనీలో ఇటీవల జరిగిన సురభి కళాకారుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో భాగంగా నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ వారు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ని శాలువతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ..అసోసియేషన్ సభ్యులను ఉద్దేశించి నూతనంగా ప్రెసిడెంట్ లుగా ఎన్నికైన శేఖర్, వెంకట్ రెడ్డి మరియు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జవాబుదారీగా పని చేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ వారి విజ్ఞప్తి మేరకు సీసీ రోడ్డు, ప్లే గ్రౌండ్ లో ఐమాస్ లైట్, తదితర డిమాండ్ లను సానుకూలంగా స్పందిస్తూ సాయిశక్తుల కృషి చేస్తానని అన్నారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణను గాడిలో పెట్టాలని ఆ విభాగాల అధికారులను ఫోన్ లో ఆదేశించారు. సురభి కాలనీలో దాదాపుగా సీసీ రోడ్లు పూర్తవుగా మిగిలిన ఒకటి, రెండు బిట్ లను త్వరితగతిన పూర్తి చేయిస్తానని అన్నారు. అనంతరం సురభి కాలనీ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కొరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురభి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ ఏ చంద్రశేఖర్, ఆర్ వెంకట్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జయ కృష్ణ, సెక్రటరీ వెంకట భాను, జాయింట్ సెక్రటరీ జితేందర్ రెడ్డి, ట్రెజరర్ సుధ, గౌరవ సలహాదారులు సుబ్బారావు, ఆర్ కోదండరావు, మాజీ సెక్రటరీ రమణ కుమార్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొందరికే రైతు పండుగ

### ఇమ్మారెడ్డి నవీన్ రెడ్డి




**నూతనకల్ 01డిసెంబర్ (తరంగాలు):**
నూతనకల్ మండల పరిధిలోని తాలసింగారం రైతు వేదిక క్లస్టర్ లో శనివారం జరిగిన రైతు పండుగ సంబరాలలో రెండు లక్షల లోపు రైతు రుణమాఫీ మాఫీ అయింది సంతోషకరమైన కానీ, రెండు లక్షల పై చిలుకు ఉన్న రుణాలను కూడా మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిందని ఆదివారం విలేకరుల సమావేశంలో రైతు ఎమ్మారెడ్డి నవీన్ రెడ్డి అన్నారు . రెండు లక్షల పైచిలుకు ఉన్న రైతు రుణమాఫీ లను రైతు పండుగ సంబరాలలో ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ రాకముందు రెండు లక్షల పై చిలుక ఉన్న రుణాలను మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను విస్మరించడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండు లక్షల పై చిలుక ఉన్న రుణాలను మాఫీ చేయాలని ఆయన అన్నారు.

# కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

### -ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే నాయిని వల్లే సాధ్యమైంది

### -మహమ్మద్ అంకుస్




**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 01(తరంగాలు)**
కాజీపేట మీడియా పాయింట్ విలేకరుల సమావేశంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ అంకుస్ మాట్లాడుతూ కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రాష్ట్ర విభజన చట్టం 2014లో చట్టంలో పొందుపరిచి ఏ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో పనులు ప్రారంభించాలని చట్టం చేశారని అదేవిధంగా 2009 సంవత్సరంలో ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో రైల్వే మంత్రి మమత బెనర్జీ ఆధ్వర్యంలో కాజీపేటకు రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ రిపేర్ యూనిట్ మంజూరు చేశారని నాడు ఎంపీగా ఉన్న సిరిసిల్ల రాజయ్య,నాటి దేవాదాయ శాఖ మంత్రి చొరవతో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మడికొండ ఎండోమెంట్ భూమిలో 54 ఎకరాలు కేటాయిస్తూ 18 కోట్ల రూపాయలు విడుదల చేశారని,శంకుస్థాపన చేసే క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని,తద్వారా వాయిదా పడ్డ శంకుస్థాపనను ఎన్నికలలో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి పది సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందంతో రైల్వే పరిశ్రమలను నిర్లక్ష్యం చేశారని నాడు పట్టించుకోని వాళ్ళు నేడు మా ఉద్యమ ఫలితమే అని ప్రకటనలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే అని ఇలాంటి జిమ్మిక్కుల రాజకీయాలను మానుకోవాలని ప్రాంతీయతత్వం, మతతత్వం,వర్గబేదాలను రెచ్చగొట్టే విధానాలు తో పదవులకు రావడం ప్రజలను తప్పుదోవ పట్టించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అని ఇలాంటి తప్పుడు ప్రకటనలను మానుకోవాలని టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, మాజీ చీఫ్ విప్,నాయకులను హెచ్చరించారు.ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పై శ్రద్ధతో చిత్తశుద్ధితో ప్రణాళిక బద్ధంగా స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కాజీపేట రైల్వే పరిశ్రమల అభివృద్ధి,ప్రాంత అభివృద్ధిపై,నియోజకవర్గ అభివృద్ధిపై సుమారు సంవత్సరం కాలంలో ఎన్నో మార్లు కలిసి విన్నవించి వేలకోట్ల అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ చేస్తుంటే జీర్ణించుకోలేని టిఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి, బెంబేలెత్తిపోయి కేవలం వారి పార్టీ అధిష్టానం మెప్పు కోసమే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు.కాజీపేట బస్టాండ్ నిర్మించాలని,రైల్వే కోచ్ ఫ్యాక్టరీ,వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ రిపేర్ యూనిట్,రైల్వే ప్లాట్ఫార్మ్ పెంచాలని, బోడగుట్ట రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని,ఫాతిమా నగర్ కాజీపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయుటకు సహకరించాలని, కాజీపేట మెయిన్ రోడ్డు నుండి డీజిల్ కాలనీ వరకు ఫాతిమా బ్రిడ్జ్ వరకు రైల్వే స్థలంలో చిరు వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించాలని కాజీపేట రైల్వే పరంగా నిర్లక్ష్యానికి గురైన అన్ని అంశాలను స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పట్టుదలతో రైల్వే జీఎంను,డిఆర్ఎం ను పలుమార్లు కలిసి వినతి పత్రం సమర్పించి గతంలో పిసిసి అధ్యక్షులుగా ఉన్న నాటి పార్లమెంట్ సభ్యులు నేటి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి దృష్టికి ఎన్నోసార్లు తీసుకువెళ్లడం జరిగిందని తెలియజేశారు. పది సంవత్సరాలు ప్రభుత్వంలో ఉండి పట్టించుకోని నాయకులు 10 నెలల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జీర్ణించుకోలేక ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలను చేస్తున్నారని 130 సంవత్సరాల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశంలో బడుగు బలహీన వర్గాలకు దళితులకు మైనార్టీలకు వెనుకబడ్డ అందరికీ న్యాయం జరుగుతుందని సెక్యులర్ విధానాలతో మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఉంటుందని ఎన్ని ఆటంకాలు ఎదురైన సెక్యులర్ విధానాలను మరువబోదని అంకుస్ తెలియజేశారు.కాజీపేటలో అన్ని రాజకీయ పార్టీలు ఏకమై ఉద్యమం చేస్తున్న సందర్భంలో నాడు ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉండి, చీఫ్ విప్ గా ఉండి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసి నేడు సన్మానాల పేరుతో జిమ్మిక్కులు చేయడం విడ్డూరంగా ఉందని, ఆశ్చర్యమేస్తుందని అంకుస్ అన్నారు.కాజీపేట పట్టణ అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి ఉద్యమకారునిగా చెప్పుకుంటూ కనీసం కాజీపేట బస్టాండ్ నిర్మించాలని ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన తరువాత వారి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, చీఫ్ విప్ గా ఉండి ఒక్కరోజు కూడా కాజీపేట బస్టాండ్ కోసం మాట్లాడకపోవడం ప్రజలు మర్చిపోలేదని కేవలం ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో ఉద్యమకారునిగా మన ముందుకు వచ్చి రెచ్చగొట్టే విధానాలతో రాజకీయాలు చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్యను అని ఎద్దేవా చేస్తూ కేవలం కెసిఆర్,కేటీఆర్, బోయినపల్లి వినోద్ కుమార్ ల మెప్పు కోసమే ఇలాంటి అబద్ధాల చేయడం చేస్తున్నారని అవి మానుకోవాలని అంకుస్ అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ అంకుస్ తో పాటు 63 వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలి,మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్,డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల ఉపేందర్, తమ్మడి మధు మానస, ఇప్ప శ్రీకాంత్ ,క్రాంతి భరత్,అలీం, బబ్లు,ఇమ్రాన్, మహమ్మద్ అబ్దుల్ షబ్బీర్ (తబు),లక్ష్మణ్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామన్న రేవంత్ రెడ్డి

### -రాజకీయ పంతం తో విద్యార్థుల భవిష్యత్ తో ఆటలాడుతున్నాడు

### -బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి



**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 01 (తరంగాలు)**
బి ఆర్ ఎస్ పార్టీ గురుకుల బాటలో భాగంగా ములుగు జిల్లాలోని జాకారం,బండారు పల్లి,చల్వాయ్ లోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్, కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ లలో పర్యటించిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి,ములుగు మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి.ఈ సందర్భంగా ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా విద్యా శాఖ మంత్రి లేరు. భవిష్యత్ తరాలకు పునాదులు వేసే విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారు.రేవంత్ రెడ్డి కి ఇంకా కొత్తగా ముఖ్యమంత్రి అయిన మురిపెం పోలేదు.పాలన పైన పట్టు కోల్పోయి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను నిర్వీర్యం చెయ్యాలని కుట్ర చేస్తుంది. అందులో భాగంగానే నిరుపేద విద్యార్థులు చదువుకునే గురుకులాల్లో వరుస మరణాలు, ఆహార విషతుల్యం జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తుంది.చలికాలం పిల్లలకు దుప్పట్లు ఇవ్వాలన్న సోయి లేదు.అందుకే మా వంతుగా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసామన్నారు.హాస్టల్ ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. డార్మెటరీ లో విద్యార్థులు ప్రశాంతంగా నిద్రించే పరిస్థితి లేదు.డార్మెటరి, వంటశాలలు,మరుగుదొడ్లు మాత్రం హృదయవిదారకంగా ఉన్నాయన్నారు.కెసిఆర్ నాయకత్వం లో గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి.కెసిఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామన్న రేవంత్ రెడ్డి రాజకీయ పంతంతో విద్యార్థుల భవిష్యత్ తో ఆటలాడుతున్నాడు అని అన్నారు తినే అన్నంలో పురుగుల వస్తున్నాయని చదువుకునే పిల్లలు పల్లెం లు పట్టుకొని రోడ్డెక్కి ఆర్తనాదాలు చేసే దుస్థితి దాపురించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా పది నెలల్లోనే 49 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, 1200 మందికి పైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురవడం విచారకరం.రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల సమస్యలను రాజకీయ కోణంలో




చూడకుండా మానవీయ కోణంలో ఆలోచించి సమస్యలు పరిష్కారం చెయ్యాలి. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు తల్లిదండ్రులను వదిలి హాస్టల్ లో ఉంటున్న పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన ప్రభుత్వ ఇంత కర్కశంగా వ్యవహరించడం దారుణం.తల్లి పాత్రలో ఉన్న జిల్లా మంత్రులు కొండా సురేఖ,సీతక్క రాజకీయ ప్రకటనలు చేస్తూ పిల్లల, తల్లిదండ్రులు ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నారు అని అన్నారు.బడే నాగజ్యోతి మాట్లాడుతూ... గిరిజన, ఆదివాసీ బిడ్డలు సొంత ఇల్లుగా భావించె ఆశ్రమ పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టింది. సీతక్కకు రాష్ట్రం మొత్తం తిరిగే సమయం ఉంది కానీ తనను గెలిపించుకున్న సొంత ములుగు లో గురుకులాలను సందర్శించె సమయం లేదు.హై క్వాలిటీ వీడియోల మీద దృష్టి పెట్టే మంత్రి సీతక్క మా ఆదివాసీ బిడ్డల జీవితాలను,కష్టాలను ప్రపంచానికి చూపించి తాను ఎమ్మెల్యే అయి మంత్రి కూడా అయింది.కానీ,మా అధివాసి ప్రాంతం ఏడాది అయినా ఎక్కడి గొంగడి అక్కడే ఉంది.కనీసం ఆశ్రమ పాఠశాలలను, గురుకులాలను అయినా బాగుచేసే దృష్టి లేదు.

# ఎల్ ఓ సి ..(1'50'000) అందజేత



**కూకట్ పల్లి 01డిసెంబర్ (తరంగాలు):** కూకట్ పల్లి డివిజన్ లో నివాసం ఉంటున్న అరుణ, వీరరాజు కి హార్ట్ స్ట్రోక్ రావడం తో వారికి స్టెంట్ వేయాల్సి రావడం తో నిమ్స్ హాస్పిటల్ లో చేరడం జరిగింది. వారి కుమారుడు సూరజ్ కూకట్పల్లి లోని గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయం లో సంప్రదించగా కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీ బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిది కి అప్లై చేయడం జరిగింది.. వారికి 1,50,000 రూపాయల ఎల్ ఓ సి లెటర్ of క్రెడిట్ మంజూరు అయ్యింది..ఆ ఎల్ ఓ సి లెటర్ ను కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ చేతుల మీదుగా వారి కుమారుడు సూరజ్ కి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో లక్ష్మయ్య, అరుణ్, మస్తాన్ రెడ్డి, అస్లాం, పి అరుణ్ మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,బండి రమేష్ కి గొట్టుముక్కల వెంకటేశ్వర రావు కి కృతజ్ఞతలు తెలియజేశారు



**శేరిలింగంపల్లి 01డిసెంబర్ (తరంగాలు):** కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి సమావేశాలలో పాల్గొన్న 124 ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్

# ఆలేరులో టిడిపికి పూర్వ వైభవం

**నియోజకవర్గ సమన్వయకర్త రేగు బాల నరసయ్య.**



**రాజాపేట 01డిసెంబర్ (తరంగాలు):** తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆలేరు నియోజకవర్గం సమన్వయకర్త బోనగిరి పార్లమెంట్ అడ్ హక్ కమిటీ సభ్యులు రేగు బాల నరసయ్య పిలుపునిచ్చారు. రాజపేట మండల కేంద్రంలో ఆదివారం జరిగిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలకు సభ్యత్వం అందజేసారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షులు మచ్చ నరసింహ గౌడ్, భువనగిరి పార్లమెంట్ కార్యదర్శి తుర్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గుండా భాస్కర్, యాదగిరిగుట్ట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కళ్లెం బాబురావు గౌడ్ ఎడపెల్లి సత్తయ్య స్థానిక నాయకులు డాక్టర్ నీల కనకయ్య కల్లూరి మల్లారెడ్డి గొల్లేని ఐలయ్య కొత్త నరసింహులు ఎర్ర కిష్టయ్య జెట్ట బీరప్ప శీతల సిద్ధులు వేముల సత్తయ్య షేక్ కాసిం తదితరులు పాల్గొన్నారు.

# విద్యా దినోత్సవంసందర్భంగా విద్యార్థులకు పరీక్షలు



**రాజాపేట, 01డిసెంబర్ (తరంగాలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న " ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలు ". లో మొదటి రోజు 'విద్యా దినోత్సవం' లొ భాగంగా ఆదివారం స్థానిక ఎం ఆర్ సి లో 'పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశం పై మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి చందా రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా స్పెషల్ ఆఫీసర్ జినుకల శ్యాం సుందర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుంది కావున వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానం లో ఉండాలి అని తెలిపారు.వ్యాసరచన పోటీలలో ఉన్నత పాఠశాల విద్యార్థులు సి.హెచ్.అఖిల దేవి ( రఘునాదపూర్),సి. హెచ్ . హాసిని ( రాజపేట),ఆర్ . అఖిల్ (పాముకుంట)లు. ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు పొందగా విద్యార్థులకు బహుమతి ప్రదానం, ప్రశంశా పత్రాలను అందచేశారు.ఈ కార్యక్రమంలో ఆర్. ఐ.రమేష్, ఇన్విజిలేటర్ గా గౌట్ బాలరాజు,ఎం. ఆర్. సి. సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**-బచ్చోడు గ్రామంలో వరికల్లాలను పరిశీలించిన అఖిలపక్ష బృందం**

**-అధికార యంత్రం స్పందించి రైతులను ఆదుకోవాలి**

**-సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను**



**పాలేరు ఆర్సీ,01డిసెంబర్ (తరంగాలు):** పాలేరు నియోజకవర్గం తరుమలాయపాలేం మండల పరిధిలోని బచ్చొడు గ్రామంలో వడ్ల కల్లాలను ఆదివారం అఖిలపక్ష బృందం నాయకులు సందర్శించారు.తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో వడ్లను ఆరబెట్టి వందల మంది రైతులు కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నా కూడా ఇంతవరకు ధ్యానం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు.రైతులు ఇబ్బందులు పడుతున్నారని,ఒకపక్క వర్షం వస్తుంటే వడ్లు కొనక పోవడం వల్ల రైతులు ఆవేదన గురవుతున్నారని,వెంటనే బచ్చోడు గ్రామంలో ధ్యానం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్,టిఆర్ఎస్ మండల్ నాయకులు జక్కుల యాదగిరి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా అధికార యంత్రం స్పందించి బచ్చొడులో ధ్యానం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.ఇక్కడి నుంచి దూరం తీసుకెళ్లాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారన్నారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శులు బింగి రమేష్, తుళ్లూరు నాగేశ్వరావు, అంగిరేకుల నరసయ్య ,గొర్రె పాటి దర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**-హనుమకొండ మండల స్థాయి పోటీలకు హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**-విద్యార్థులకు బహుమతుల ప్రధానం**

**-జ్ఞానము ద్వారానే విద్యార్థులు విజయ తీరాలకు చేరుతారు - ఎమ్మెల్యే నాయిని**



**హన్మకొండ 01డిసెంబర్ (తరంగాలు):** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారము పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా మొదటి రోజు విద్యా దినోత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలను హనుమకొండ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుబేదారి యందు నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 150 మంది విద్యార్థులు పలు పాఠశాలల నుండి హాజరు అయినారు.ముఖ్య అతిథిగా హాజరైన అనుమకొండ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.జ్ఞానము ఆర్జించడం ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరగలుగుతారని, నిరంతరము అధ్యయనము సాగిస్తూ ఇలాంటి పోటీలలో పాల్గొనాలని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వము పాఠశాల విద్యార్థులు, పాఠశాలల మౌలిక వసతులకు అత్యధిక ప్రాధాన్యత అందిస్తోందని,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అవసరాలు తీరుస్తోందని ఆయన తెలిపారు.మండల స్థాయిలో జరిగిన పోటీలకు పెద్ద మొత్తంలో విద్యార్థులు హాజరు కావడం సంతోషకరమైన విషయమని ఆయన తెలిపారు.తదనంతరము విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు సర్టిఫికెట్లు అందించారు.మండల స్థాయి వ్యాసరచన పోటీలలో మొదటి బహుమతి తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్,హనుమకొండ కు చెందిన వి.వర్ష పొందారు.ద్వితీయ బహుమతి సుబేదారి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.అంకిత పొందారు.తృతీయ బహుమతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వడ్డేపల్లి కి చెందిన విద్యార్థి జి.నందిని పొందారు.కన్సోలేషన్ బహుమతిని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పొందారు.హనుమకొండ మండల నోడల్ అధికారి,సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోతు నెహ్రూ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని,ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత మధ్యాహ్న భోజనము, నోటు పుస్తకాలు అందిస్తోందని అలాగే విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడానికి కృషి జరుగుతోందని తెలిపారు.ఇంకా ఈ కార్యక్రమంలో గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఏ. శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి,ఉపాధ్యాయులు సురేష్ సిఆర్పి ఉమాదేవి,షఫీ,మండల ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ అజయ్,వివిధ పాఠశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 10 వ తేదీన నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలి

**-సుప్రీంకోర్టు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి**

**-మాదిగల న్యాయ బద్దమైన డిమాండ్ లను నెరవేర్చాలి**

**-ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాదిగ జేఏసీ నాయకులు బోసుపల్లి ప్రతాప్**



**తుర్కయంజాల్ 01డిసెంబర్ (తరంగాలు):** డిసెంబర్ 10 వ తేదీన ఇబ్రహీంపట్నంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాదిగ జేఏసీ చేసిన నాయకులు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ అభ్యుదయ సంఘం లో నియోజకవర్గ మాదిగ జేఏసీ నాయకులు కొండ్రు పురుషోత్తం ఆధ్వర్యంలో మాదిగ నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాదిగ జేఏసీ చేసిన నాయకులు బోసుపల్లి ప్రతాప్, జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు రావుగాళ్ళ బాబు లు మాట్లాడుతూ మాదిగల న్యాయ బద్దమైన డిమాండ్ లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని, డిసెంబర్ 10 వ తేదీన ఇబ్రహీంపట్నంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గత 30 సంవత్సరాలుగా పోరాడుతున్న ఉద్యమం తుదిదశకు చేరుకున్న సందర్భంగా మాల సామాజిక వర్గ నేతలు అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన రోజే అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ నోటిఫికేషన్ లు, ఏబిసిడి వర్గీకరణ అయిన తర్వాతనే ఇస్తాము అని చెప్పి మాట తప్పారన్నారు. టీచర్ల ఉద్యోగాలు గ్రూప్ ఫోర్ ఉద్యోగాలు వచ్చాయని, అన్నిట్లలో మాదిగలు చాలా నష్టపోయారని తెలిపారు. 2000 నుండి 2004వ సంవత్సరం వరకు నాలుగు సంవత్సరాలు రిజర్వేషన్లు అమలైన సందర్భంగా 20000 ఉద్యోగాలు సాధించిన మాదిగలు ఏది ఏమైనా ఏ బి సి డి వర్గీకరణ సాధించే వరకు మాదిగలు ఉద్యమిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దీనిపై నిర్ణయం తీసుకొని ఎబిసిడి చేయాలన్నారు. మాలలు ఎన్ని ప్రలోభాలు పెట్టినా ఏ రాజకీయ పార్టీ కానీ ప్రజా సంఘాలు గాని ఒప్పుకునే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ నాయకులు మల్లెల ఉపేందర్, బచ్చిగల రమేష్, మల్లెల బాలరాజ్, గుండ్ల అర్జున్, మల్లెల బాలకిషన్, మల్లెల రఘు, శివరాల రమేష్, కంది కంటి అశోక్, మల్లెల యాదయ్య, మేతరి కుమార్ మల్లెల జగదీష్,

# భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

**-డబుల్ బెడ్రూం ఇల్లు, నెలకు కనీసం పది రోజుల పని దినాలు కల్పించాలి**

**-'ప్రతి అమావాస్య మాకు పున్నమే" కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ**



**హైదరాబాద్ 01డిసెంబర్ (తరంగాలు):** రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు లేబర్ కమిషన్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులు, డబుల్ బెడ్రూం ఇల్లు లేదా 250 గజాల ఇంటి స్థలం, నెలకు కనీసం పది రోజుల పని దినాలు కల్పించాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కార్మికులకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ఏడాది సంబరాలు చేసుకుంటున్నారని, కానీ అసంఘటిత, భవన నిర్మాణ కార్మికులు, ప్రజలు మాత్రం కాంగ్రెస్ పాలనలో అనేక బాధలు పడుతున్నారని ఆయన అన్నారు. జై స్వరాజ్ ట్రేడ్ యూనియన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు గోల్కొండ రత్నం ఆధ్వర్యంలో ఆదివారం నాడు హైదరాబాద్లోని రాంనగర్ ప్రాంతంలోని భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన"ప్రతి అమావాస్య మాకు పున్నమే" అనే కార్యక్రమంలో భాగంగా కార్మిక నాయకులతో కేఎస్ఆర్ గౌడ పలు అంశాలపై చర్చించారు. జై స్వరాజ్ ట్రేడ్ యూనియన్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మాటూరి కృష్ణ మోహన్, న్యూ అభయ సెంట్రింగ్ అండ్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కడెం నర్సింహా, యూనియన్ నాయకులు టి. వాసుదేవ్, ఎ.బి.షమీమ్, ఇ. సదానంద్, ఎం. యాదగిరి, మండల నర్సింహా, బండారి నారాయణ, అనిమొని రాములు, జి. చిన్నయ్య, ఎ. శ్రీనివాసులు, కె. రవీందర్, జి. నిరంజన్, జి. నర్సింగరావు, ఎం. లక్ష్మీ నారాయణ, పి. కరుణాకర్, సి. రాములు, బి. సుమన్ తదితరులు భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని కేఎస్ఆర్ గౌడ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ఉన్న 25 లక్షల భవన నిర్మాణ, అసంఘటిత కార్మికుల అందరికీ తక్షణమే హెల్త్ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేఎస్ఆర్ గౌడ డిమాండ్ చేశారు. హెల్త్ క్యాంపుల వల్ల భవన నిర్మాణ కార్మికులకు ఒరిగేదేమీ లేదని, లేబర్ కమిషన్ నిర్వహించిన ఈ క్యాంపుల పేర ఇప్పటికే వందల కోట్ల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని, ఈ క్యాంపులు కార్మికులకు లేనిపోని బాధలు సృష్టిస్తుంటే, అక్రమార్కులకు జేబులు నింపుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న జై స్వరాజ్ పార్టీ చేస్తున్న పోరాటాల్లో పాలుపంచుకోవాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. తాము ఇప్పటికే భవన నిర్మాణ కార్మికులకు సొంతింటి కోసం, నెలకు కనీసం పది రోజుల పని దినాలు కోసం, ప్రభుత్వానికి సంబంధించిన కాంట్రాక్టు పనుల్లో స్థానిక కార్మికులకు ప్రథమ ప్రాధాన్యం కోసం అనేక ఉద్యమాలు చేస్తున్నామని జై స్వరాజ్ ట్రేడ్ యూనియన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు గోలుకొండ రత్నం అన్నారు. ఇప్పటికే అనేక ఏరియా కమిటీలను ఏర్పాటు చేశామని, త్వరలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని, కార్మిక పక్షపాతులు తమతో కలిసి రావాలని రత్నం కోరారు. భవన నిర్మాణ కార్మికుల హెల్త్ కార్డులు, ఇల్లు, కనీస పని దినాల కల్పనతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం జై స్వరాజ్ పార్టీ చేసే ఆందోళనల్లో తాము పాల్గొంటామని కడెం నర్సింహా ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## బ్రహ్మాండమైన విజయంతో నన్ను ఆశీర్వదించిన బ్రాహ్మణ సంఘం సభ్యులకు నా ధన్యవాదాలు

**-ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**




**కుత్బుల్లాపూర్ 01డిసెంబర్ (తరంగాలు):** జీడిమెట్ల 130 డివిజన్ ప్రశాంతి వనంలో గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మూడు పర్యాయాలు నా వెంట ఉంటూ నన్ను నిండు మనసుతో ఆశీర్వదించి ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయాన్ని అందించిన బ్రాహ్మణ సోదరులకు ధన్యవాదాలు. నా వెంటే ఉంటూ నన్ను అఖండ మెజార్టీతో గెలిపించిన బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులకు నా కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఫెరోజ్, పివి. భాస్కర్ రెడ్డి, హరిబాబు యాదవ్, పూర్ణచందర్ గుప్తా, చింతయ్య యాదవ్, జగతయ్య, వొల్లూరి ప్రసాద్, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్, ముఖ్య సలహాదారులు & సీనియర్ రిపోర్టర్ రమేష్ కుమార్, పరశురాం శర్మ, కార్యవర్గ సభ్యులు రాంబాబు, హరి, శ్రీధరాచార్యులు, ఫణీంద్ర, శశిధర్, శ్రీహరి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కాలిపోయిన మోటార్లను త్వరగా ఏర్పాటు చేయాలి



**భద్రాద్రి 01డిసెంబర్ (తరంగాలు):** కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురం ఉమ్మడి గ్రామపంచాయతీలో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కారణంగా పంచాయతీలో ఉన్న అన్ని మోటార్లు కాలిపోవడం ఈ స్థితికి కారణం ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన లో వోల్టేజ్ వల్ల ఫ్యాన్ కాలిపోతున్నాయని చెప్పినా కూడా స్పందించకపోవడం ఈ సమస్యకు కారణం ముందే చెప్పిన విధంగా ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసి ఉంటే ఈరోజు పంచాయతీలో మోటర్లు కాలిపోకుండా ఉండేవి దీనివల్ల నీరు లేక కనీసం స్నానానికి మూడు రోజుల నుంచి నీరు లేని పరిస్థితి అలాగే గ్రామంలో అయ్యప్ప స్వాములు స్నానాలు ఆచరించడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది ఇప్పుడైనా విద్యుత్ శాఖ వారు హెవీ ట్రాన్స్ఫర్మర్ లను ఏర్పాటు చేయాలని అలాగే కాలిపోయిన మోటార్లను త్వరగా ఏర్పాటు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర విద్యార్థి నాయకుడు ఆంగోత్ నగేష్ మరియు సేవాలాల్ సేన జిల్లా భద్రు నాయక్ మరియు పాండురంగాపురం మాజీ సర్పంచ్ ఇస్లావత్ దేవి గారు గ్రామస్తులు పాల్గొన్నారు

## నేడు ట్రస్మా ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల కాన్ఫరెన్స్



**హైదరాబాద్ 01డిసెంబర్ (తరంగాలు):** తెలంగాణ గుర్తింపు పొందిన ప్రవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా ) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హెడ్మాస్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు కే రామేశ్వర్ రెడ్డి ఓ ప్రకటనలు తెలిపారు. ఎనర్జీ టు సినర్జీ న్యూ డైరెక్షన్స్ 2025 అనే అంశంపై పాఠశాల యాజమాన్యం, హెడ్మాస్టర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యు డైస్ ప్లస్ తోపాటు ఇతరత్రా ఆన్లైన్, అపార్, ఎన్ ఈ పి సమస్యలపై సంబంధిత అధికారులతో అనుమానాల నివృత్తి చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. సూరారం లోని విజపి ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా డిఈఓ విజయ కుమారి ప్రారంభిస్తారని తెలిపారు. స్టేట్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ మురళి కృష్ణ, మేడ్చల్ జిల్లా అకాడమిక్ మనిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఏఎచ్ పి ఎస్ రీజినల్ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి, విస్బిల్టీ అఫ్ లెర్నింగ్ మెంటార్ అండ్ ట్రైనర్ రఘరామ్, ప్రముఖ సైకోలాజిస్ట్ సుదీర్ సంద్ర లు వివిధ అంశాలపై శిక్షణ అందజేస్తారన్నారు. కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ లు హాజరువుతారనికి తెలిపారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ లు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలి





**-జిల్లా పరిషత్తు మాజీ చైర్మన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి**



**కూకట్ పల్లి 01డిసెంబర్ (తరంగాలు):** ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ కనబరచాలని రంగారెడ్డి జిల్లా పరిషత్తు మాజీ చైర్మన్ కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్ లో తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఎవరికి వారు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు రోగాల నిర్ధారణకు పరీక్షలు చేయించుకోవాలని తద్వారా రోగాల నివారణకు చర్యలు గైకొన వచ్చున్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించిన తెలంగాణ గౌడ సంఘం ప్రతినిధులు రాజేష్ గౌడ్ ను అభినందించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ దోమలగూడ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి సహకార అందించారు. ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ మణిశంకర్ (క్రిటికల్ కేర్ కన్సల్టెంట్), డాక్టర్ సౌరబ్ చిల్లూరు (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ రాజారెడ్డి (ఇంటర్నల్ మెడిసిన్), డాక్టర్ జాహ్నవి(డైటీషన్), డాక్టర్ శ్రీనివాస్ (మాస్టర్ ఇన్ ఫిజియోథెరపీ-స్పోర్ట్స్ మెడిసిన్), డాక్టర్ అభిజీయాల్(కడియాలిస్ట్) బి, పీ, ఈసీజీ, షుగర్, కంటి, ఒబేసిటీ, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్, ఆర్తో, డైటీషియన్, న్యూరో, స్కిలిటన్, మజిల్, అసెస్మెంట్ తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ రావు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కూన సత్యం గౌడ్, నజిరుద్దీన్, శ్రీధర్ ఆచారి, గిరి నాయుడు, అక్బర్, మణి గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు రేష్మ, స్వరూప గౌడ్, గౌడ సంఘం నాయకులు పి కిషోర్ గౌడ్, విజయకుమార్ గౌడ్, ప్రేమ్ కుమార్, గౌడ్, జి వినోద్ కుమార్ గౌడ్, శివరాం గౌడ్, రాజశేఖర్ గౌడ్, ఎస్ వెంకట్ గౌడ్, నితీష్ గౌడ్, మణికంఠ గౌడ్, పి సాగర్ గౌడ్, భీమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘు అభివృద్ధికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది





**-ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్ 01డిసెంబర్ (తరంగాలు):** హెచ్ఐఎల్ కాలనీ నల్లగుట్ట సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ కార్తీక వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కార్తీక వనభోజనాలు ఆధ్యాత్మిక పెంచడంతోపాటు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. 2023 ఎన్నికల్లో 85,576 ఓట్ల మెజార్టీతో నా విజయంలో కీలకంగా వ్యవహరించిన విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులకు నా కృతజ్ఞతలని, సంఘ అభివృద్ధికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ బిఆర్ఎస్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు శేషాచారి, అడ్వకేట్ కమలాకర్, నారాయణ, నరసింహా చారి, కిషోర్ చారి, దయాకర్ చారి, బాల బ్రహ్మాచారి, బిక్షపతి చారి, వెంకటేష్ చారి, బ్రహ్మానంద చారి, వేణు చారి, కేశవాచారి, నారాయణ చారి, శ్రీనివాస్ చారి, జయం చారి తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ,ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి







**-జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**

**వరంగల్, 1 డిసెంబర్(తరంగాలు):** హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పేర్కొన్నారు.ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ , తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఎయిడ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎయిడ్స్ అవగాహన పోస్టర్స్ ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. అంతకుముందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ డాక్టర్ బి సాంబశివరావు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కాకతీయ మెడికల్ కాలేజ్ ప్రధాన ద్వారామ్ నుండి ఐఎంఏ హాల్ వరంగల్ వరకు ర్యాలీని నిర్వహించడం జరిగినది.అనంతరం కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ వరంగల్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎయిడ్స్ అసురక్షిత లైంగిక సంపర్కం ద్వారా, కలుషితమైన సూదులు సిరంజిల ద్వారా, కలుషితమైన రక్తాన్ని మరొక్కరికి ఎక్కించడం ద్వారా ,హెచ్ఐవి సోకిన తల్లి నుండి పుట్టబోయే బిడ్డకు వచ్చునని అన్నారు. వివిధ వ్యాధుల ద్వారా మరణించే వారి గణాంకాల ప్రకారం కన్న ఎయిడ్స్ వ్యాధి వల్ల మరణించే వారి సంఖ్య చాలా తక్కువని తెలిపారు . ప్రజలలో వైద్య ఆరోగ్యశాఖ, ఎన్జీవోలు కీలకమైన సేవలందిస్తున్నారని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ఎయిడ్స్ పై చర్చించుకోని అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రజలలో చైతన్యం కలిగితే ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోనే అవసరమే ఉండదని ఆకాంక్షించారు. డాక్టర్ బి సాంబశివరావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న ఎయిడ్స్ సేవలపై ప్రగతి నివేదిక వివరించారు. ఈ సంవత్సరం" కలెక్టివ్ యాక్షన్ సస్టేన్ మరియు ఎక్సెలరేట్ హెచ్ఐవి ప్రోగ్రెస్" నినాదమును తెలుపుతూ జిల్లాలో ఐసిటిసి కేంద్రాలు మూడు, తల్లి నుండి హెచ్ఐవి పిల్లలకు సోకకుండా చేసే కేంద్రము ఒకటి ,ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎయిడ్స్ పై అవగాహన నిర్ధారణ చేయబడునని తెలిపినారు. ఏఆర్టీ కేంద్రం, లింకు ఎఆర్టి కేంద్రాలు, సపోర్ట్ కేంద్రాలు ద్వారా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందిస్తున్నామని తెలిపినారు. రక్తనిధి కేంద్రాలు మూడు పనిచేస్తున్నాయని 2023 24 సంవత్సరములలో 31, 688 వ్యక్తులకు హెచ్ఐవి రక్త పరీక్షలు చేయగా 493 మందికి హెచ్ఐవి ఉన్నట్లుగా నిర్ధారించడం జరిగినది ,13022మందికి గర్భిణీ స్త్రీలకు హెచ్ఐవి రక్త పరీక్షలు చేయగా ఏడు మందికి హెచ్ఐవి ఉన్నట్లు నిర్ధారించామని, ఏప్రిల్ 2024 నుండి అక్టోబర్ 2024 వరకు 19900 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించగా 262 మందికి హెచ్ఐవి ఉన్నట్టుగా నిర్ధారించడం జరిగినదని .గర్భిణీ స్త్రీలకు 11210 మందికి హెచ్ఐవి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి హెచ్ఐవి ఉన్నట్లుగా నిర్ధారించడం అయినదని, జిల్లాలోని ఆరోగ్య ఆయుష్మాన్ మందిర్ లలో డాక్టర్లకు హెచ్ఐవి టెస్టింగ్ మరియు హెచ్ఐవి ప్రాముఖ్యత గురించి ట్రైనింగ్ ఇవ్వడం జరిగినది. జిల్లా కలెక్టర్, మరియు జిల్లా న్యాయ సేవ సంస్థ సహకారముతో హెచ్ఐవి పాజిటివ్ కలిగిన వ్యక్తులకు 10 కిలోల బియ్యం ఇవ్వడం జరుగుచున్నది .కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులకు హెచ్ఐవి , టిబి ,బ్లడ్ డొనేషన్ పై అవగాహన నిర్వహించి వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వానితులు ఎయిడ్స్ పై ప్రసంగించి, అందరూ ఎయిడ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎయిడ్స్ నిర్మూలన కార్యక్రమంలో ఉన్నతమైన సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమములో ఎంజీఎం సూపర్డెంట్ డాక్టర్ కిషోర్, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ ,డాక్టర్ మోహన్, సింగ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ ,డాక్టర్ సూర్య ప్రకాష్ ,ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ అన్వర్, డాక్టర్ విజయ చందర్ రెడ్డి, డాక్టర్ శ్రవణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, ఎయిడ్స్ జిల్లా కోఆర్డినేటర్ మాధురి, డిప్యూటీ డెమో అనిల్ కుమార్ , ఎన్జీవోస్ సర్వోదయ శాంత రాజు, ఆర్డిఎంఎం ఈశ్వర్, మేరీ విజయ, మైగ్రేడ్స్ గోవర్ధన్, డిఆర్పి ముస్తాక్, ట్రాక్టర్స్ నవ్య , వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎన్సిసి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ పోటీల్లో జిల్లాను అగ్రగామిగా నిలపాలి






**-జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
**-ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా అదనపు కలెక్టర్**
**-సంధ్యారాణి తో కలిసి 2కె రన్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్**




**వరంగల్,1 డిసెంబర్ (తరంగాలు ):** సీఎం కప్ పోటీల్లో అధిక పతకాలు సాధించి జిల్లాను అగ్రగామిగా నిలపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తికానున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుండి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సంబరాలలో భాగంగా మొదటి రోజు డిసెంబరు ఒకటో తేదీన వరంగల్లోని కాశీబుగ్గ జంక్షన్ నుండి ఓ సిటి స్టేడియం వరకు జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో సీఎం కప్ ను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన 2కె రన్ ను అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు.కాశిబుగ్గ జంక్షన్ నుండి ఓసిటి మైదానం వరకు సాగిన 2కె రన్ ర్యాలీలో కలెక్టర్, జిల్లా అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, క్రీడాకారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10 నుండి 12వ తేదీ వరకు మండల స్థాయిలో, 16 నుండి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఆయా కమిటీల ఆధ్వర్యంలో వివిధ క్రీడా అంశాల్లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వరంగల్ జిల్లా నుండి ఈ పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.ఇటీవల ప్యారాలింపిక్స్ గేమ్స్ లో మన జిల్లాకు చెందిన జివాంజి దీప్తి అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించారని గుర్తు చేస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయితోపాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి సత్యవాణి, డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ కైలాష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వెంకన్న, సెక్రటరీ రఘువీర్, ధనరాజ్, కోచ్ లు, పిఈటీలు, క్రీడాకారులు, టీఎస్ ఎస్ కళాకారులు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి అవార్డులు






**వరంగల్, 1డిసెంబర్ (తరంగాలు ):** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలనకు విశేష కృషి చేసిన వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి ఐసిటిసి మెడికల్ ఆఫీసర్ డా. విజయ్ కుమార్, ఐసిటిసి కౌన్సిలర్ నీలారపు అశోక్ కుమార్ ఎంపిక అయ్యారు. ఆదివారం వరంగల్ ఐ.యం.ఏ హాల్ లో జరిగిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి, డి.యం అండ్ హెచ్.ఓ డా. సాంబ శివ రావుల చేతుల మీదుగా ఐసిటిసి మెడికల్ ఆఫీసర్ డా. విజయ్ కుమార్, ఐసిటిసి కౌన్సిలర్ నీలారపు అశోక్ కుమార్ అవార్డులు అందుకున్నారు. కరోనా సమయంలో హెచ్ఐవి పేషెంట్లకు డా. విజయ్ కుమార్ ట్రీట్మెంట్ అందించడంతో పాటు ప్రతి రోజూ పేషెంట్లకు వైద్యం అందిస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా ఆసుపత్రిలో పేషెంట్లకు హెచ్ఐవి టెస్ట్ లు చేయించి వైరస్ ను వున్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్,వారి జీవిత కాలం పెంచేందుకు ఎ.ఆర్.టి మందులను ఐసిటిసి కౌన్సిలర్ నీలారపు అశోక్ కుమార్ అందిస్తున్నారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంమూర్తి,వైద్యులు నర్సింగ్ సుపర్ఇండిడెంట్ ఫ్లారేన్స్ ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ లడే రమేష్, పార మెడికల్ సిబ్బంది తదితరులు అభినందించారు.

## ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-వైద్యాధికారి సరోజ**



**చెన్నారావుపేట, 1డిసెంబర్ (తరంగాలు):** ఎయిడ్స్ వ్యాధి ప్రాణాంతకమైన, అంటించుకునే వ్యాధి అని, అంటువ్యాధి కాదు అని ప్రజలు అప్రమత్తంగా ఉండక పోతే ప్రాణాపాయం వస్తుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సరోజ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి గురైన వ్యక్తుల నుండి తీసిన రక్తం ద్వారా,ఒకరికి వాడిన సిరింజిలు మరొక్కరు వాడటం వల్ల వ్యాధి ఇతరులకు సంక్రమిస్తుందని తెలిపారు. అసాంగిక లైంగిక సంక్రమణ ద్వారా కూడా వ్యాధి వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలు కూడా వ్యాధిగ్రస్తులను వేరు చేయకుండా మనో ధైర్యం కల్పించాలని సూచించారు. వ్యాధి వచ్చిన వారు కూడా బలవర్ధకమైన ఆహారం తీసుకోవటం, సమయానికి వైద్యుల సూచనతో మందులు మింగటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వల్ల జీవన ప్రామాణాన్ని పెంచుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భద్రయ్య, స్టాఫ్ నర్సు హేమలత, కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయురాలు కవిత, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి తోటి మిత్రుల సహాయం



**చెన్నారావుపేట, 1డిసెంబర్ (తరంగాలు )** స్నేహితుడు అనారోగ్యంతో చనిపోవడంతో అతడి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు.మండల కేంద్రంలోని జాగృతి విద్యానికేతన్ పాఠశాలలో చదువుకున్న వజ్జంతి రాజేంద్రచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు ఆదివారం స్నేహితుని చిత్రపటానికి నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 125 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులు మాట్లాడుతూ అనారోగ్యంతో చిన్ననాటి మిత్రుడు మృతి చెందడం బాధాకరమన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మిత్రుని కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కోరారు.

తరంగాలు Tharangalu Daily News Paper

# విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

**మండల విద్యాశాఖాధికారి బైరి సరళ**



**చెన్నారావు పేట, 1డిసెంబర్ (తరంగాలు ):** విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి బైరి సరళ అన్నారు చెన్నారావుపేట మండల కేంద్రం లోని ఎం.ఆర్.సి.కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలలు విద్యార్థులకు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో మండలం లోని అన్ని పాఠశాలలు విద్యార్థులకు వ్యాసరచన పోటీలను మండలవిద్యాశాఖాధికారి బైరి సరళ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది.5వ తరగతి నుండి 7 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు భారతదేశ అభివృద్ధి లో రైతుల పాత్ర,అలాగే 8,9,10 చదువుతున్న విద్యార్థులు నీవు ముఖ్యమంత్రి అయితే ఏమి చేస్తావు ఈ అంశాలపై విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓమాట్లాడుతూ ఇలాంటి పోటీ పరీక్షలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.ఆదివారం జరిగిన మండల స్థాయి పోటీల్లో విజేతలు అయిన వారు జూనియర్ విభాగంలో ప్రధమ బహుమతి ఆర్.కిశోర్ (6వతరగతి) హైస్కూల్ ఉప్పరపెల్లి ,ద్వితీయ బహుమతి బి. మోక్ష (7వ తరగతి) కె.జి.బి.వి చెన్నారావుపేట.అలాగే సీనియర్ విభాగంలో ప్రధమ బహుమతి ఆర్.కీర్తన (9వతరగతి) ఉప్పరపెల్లిహైస్కూల్ ,ద్వితీయ బహుమతి డి స్వాతి( 10 వతరగతి),కె.జి.బి.వి చెన్నారావుపేట పాఠశాలల విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. ప్రధమ,ద్వితీయ బహుమతులు గెలుపొందిన విద్యార్థులకు ఎం.ఈ. ఓ. షీల్డ్ లను అందించారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు మధ్యాహ్నం 2 గంటలకు వరంగల్ లోని శంభునిపేట హైస్కూల్ లో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనాలని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న అందరి విద్యార్థులకు బహుమతులు నుఎం.ఈ.ఓ. ఆందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ,శౌరీలు,పల్లవి,మంజుల, ఎం.ఆర్.సి.సిబ్బంది స్వప్న, అశోక్ ,యాదగిరి సీఆర్పీ లు సంపత్,బాలు, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

# రంగు కర్ణాకర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన గౌడ సంఘం సభ్యులు

**రూ.10వేలు ఆర్థిక సహాయం చేసిన కౌండిన్య గౌడ సంఘం**



**పర్వతగిరి,డిసెంబర్ 1,(తరంగాలు)** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన రంగు కర్ణాకర్ గౌడ్ ఇటీవల అనారోగ్యతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కౌండిన్య గౌడ పరపతి సంఘం సభ్యులు రంగు కర్ణాకర్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టాపురం ఏకాంతం గౌడ్, కౌండిన్య గౌడ పరపతి సంఘం అధ్యక్షులు,తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, రంగు కుమారస్వామి గౌడ్, కౌండిన్య గౌడ పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి,బాల్య వెంకటరాజు గౌడ్,కౌండిన్య గౌడ పరిపతి సంఘం, కోశాధికారి,సంగం గౌరవ సలహాదారులు రంగు కుమారస్వామి గౌడ్,జక్కుల మధు గౌడ్,బూర శ్యామ్ గౌడ్, చిర్ర శ్రీనివాస్ గౌడ్,మెరుగు రమేష్ గౌడ్,బొమ్మెర లింగమూర్తి గౌడ్,కర్ణాటక నర్సింగ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# మాలల సింహ గర్జనకు తరలిన నాయకులు



**వెల్దండ,1 డిసెంబర్(తరంగాలు):** కల్వకుర్తి నియోజకవర్గంలో మాలల సింహ గర్జన సభకు భారీ స్పందన లభించింది. హైదరాబాదులో జరుగనున్న ఈ సభకు వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పెద్ద ఎత్తున సమీకరించుకున్నారు. మాల మహానాడు నాయకులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు కలిసి "చలో మాల" కార్యక్రమంలో భాగంగా సింహ గర్జన సభకు బయలుదేరి వెళ్లారు.వెల్దండ మండలంనుంచి హైదరాబాదులో సింహ గర్జన సభకు వెళ్లిన మాల మహానాడు నాయకులు జంగిల్ యాదగిరి, జంగిల్ నిరంజన్, కూన పాండు, జంగిల్ బాబు, వెంకటేష్, శీను, మల్లేష్, ఆలూరి ప్రవీణ్, సిరిసిల్ల గళ్ళ శీను, దార చిన్న, కూన నాని, రవి తదితరులు పాల్గొన్నారు.

# హామీల గురించి బిజెపి మాట్లాడడం విడ్డూరం

**-యూత్ కాంగ్రెస్ మండల జనరల్ సెక్రటరీ కుల్ల యాకాంతం**



**వర్ధన్నపేట,1డిసెంబర్ (తరంగాలు):** హామీల గురించి బిజెపి మాట్లాడడం విడ్డూరం అని యూత్ కాంగ్రెస్ మండల జనరల్ సెక్రటరీ కుల్ల యాకాంతం అన్నారు.వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ మండల నాయకులు కుల్ల యాకాంతం మాట్లాడుతూ ప్రతి ఏటా దేశంలో 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలకు బిజేపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాల ప్రకటనపై స్పందించారు.ఈ నిరసన కార్యక్రమాలపై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటీ వరకు దేశంలో ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీన్కెనా పూర్తి చేశారా..? అనే విషయాన్ని దమ్ముంటే ప్రజల ముందు పెట్టి చర్చించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపి అధికారంలోకి వచ్చి దశాబ్దకాలం దాటిన ఇప్పటి వరకు పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా భవిష్యత్ తరాలకు తీవ్ర అన్యాయం చేస్తున్న విషయం రాష్ట్ర బీజేపి నాయకులకు తెలియక మాట్లాడితే అంత కన్నా అవివేకం లేదన్నారు. దేశ చరిత్రలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది పూర్తి కాకుండానే 50 వేల ఉద్యోగాలు భర్తి చేసిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని అన్నారు. కళ్లముందే ఈ విజయాలను ప్రభుత్వం సాధిస్తుండడం బీజేపి నాయకుల కనిపించకపోతే వారికి అందుకు సంబంధించిన వివరాలు ఇవ్వడానికి పార్టీ పక్షాన సిద్ధంగా ఉన్నామని యాకాంతం అన్నారు.దేశంలో నల్ల చట్టాలు తెచ్చి రైతుల జీవితాలను చిన్నాభిన్నం చేసే కుట్రలు చేసిన బీజేపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు దేశ రాజధానిలో చేసిన విషయాన్ని బీజేపి నాయకుడు మరిచిపోయి మాట్లాడుతున్నారని అన్నారు. ఈ విషయంపై రైతులపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర బీజేపి నేతలు కేంద్ర పెద్దల ఎదుట నిరసనలు చేయాలని సూచించారు.నల్ల చట్టాలు తెచ్చి రైతుల భవిష్యత్‌ను అంధకారం చేయాలని చూసిన బీజేపికి దేశంలోనే ఏనాడు చూడని విధంగా అధికారంలోకి వచ్చిన నేలల సమయంలో రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది రైతులకు రూ. 2 లక్షల వరకు ఋణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు ,నిరసనలు చేయడాన్ని ప్రజలే చిదరించుకుంటున్నారని అన్నారు.బీజేపి నాయకులు, బీఆర్ఎస్ నాయకులు లోపాయికారి ఒప్పందాలతో ప్రజా ప్రభుత్వాన్ని ఎన్ని ఇబ్బందులు పెట్టాలని చూసిన రాష్ట్ర ప్రజల ఆశిర్వాదం ఉన్నంత వరకు ప్రతిపక్షాల కుట్రలు కాంగ్రేస్ ప్రభుత్వాన్ని ఏమి చేయలేవని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా పాలన చేస్తున్న ప్రభుత్వానికి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలే అండగా ఉండి పనికి రాని ఆరోపణలను తిప్పి కొడతారని కూల్ల యాకాంతం పెర్కొన్నారు.

# పద్మశాలీల అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలి





**-స్థానిక ఎన్నికల్లో పద్మశాలీలకు అధిక సీట్లు కేటాయించాలి**

**-సమగ్ర కుటుంబ సర్వేలో పద్మశాలీ అని రాయించాలి**

**-పద్మశాలీ సంఘం రాష్ట్ర కమిటీలో వర్దన్నపేటకు చెందిన పలువురికి చోటు**

**-శాలువాతో సన్మానించిన అఖిల భారత పద్మశాలీ సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు ఈగ మల్లేశం**





**వరంగల్ ప్రతినిధి ,01డిసెంబర్(తరంగాలు ):** తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలీల అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు ఈగ మల్లేశంసూచించారు.ఆదివారం వర్దన్నపేట పట్టణంలోని మల్లేశం స్వగృహంలో ఏర్పాటు చేసిన పద్మశాలీల సమావేశంలో ముఖ్య అతిధిగా అఖిల భారత పద్మశాలీ సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు ఈగ మల్లేశం హాజరయ్యారు.ఇటీవలే ఎన్నుకొన్న రాష్ట్ర పద్మశాలీ సంఘం లో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వర్దన్నపేట పట్టణానికి చెందిన పెద్దూరి సంజీవ రావు,రాష్ట్ర కార్యదర్శిగా వర్దన్నపేట పట్టణానికి చెందిన మార్త సారంగపాణి,రాష్ట్ర అధికార ప్రతినిధిగా సంగెం మండల కేంద్రానికి చెందిన కందగట్ల నరహరిలు ఎన్నికయ్యారని ఈగ మల్లేశం తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న వీరికి ఈగ మల్లేశం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.గత ప్రభుత్వాలు కానీ,ప్రస్తుత ప్రభుత్వం కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత కులాల మీద రాజకీయాలు నడుస్తున్న తీరు చూస్తే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పద్మశాలీలకు రావలసిన సంక్షేమ ఫలాలు అందించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే అనే పేరు మీద సర్వే జరుపుతున్నందున మీరంతా సమగ్ర సర్వేకు సహకరించి మీ కుటుంబంలో ఉన్నటువంటి సభ్యుల పేర్లు నమోదు చేస్తూ తప్పనిసరిగా పద్మశాలీలు అని విధిగా రాయాలని సూచించారు.ఏ కులానికైనా జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న ఈ ప్రభుత్వాలు అత్యధిక జనాభా కలిగిన పద్మశాలీలు వెనుక పడటానికి కారణం మన జనాభాను మనం నిరూపించుకోకపోవడమేనని తెలిపారు.సమగ్ర సర్వేను ఉపయోగించుకొని తప్పనిసరిగా విధిగా పద్మశాలీ అని రాయాలని కోరారు.కొన్ని కులాలు కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పరిమితంగా ఉన్నాయి. కానీ భారతదేశంలో అన్ని రాష్ట్రాలలో ఉన్న ఏకైక కులం పద్మశాలీ కులం అని అన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పద్మశాలీ కులస్తులకు ఈ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన తమకు అత్యధిక సీట్లు కేటాయించాలని ఈ ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న వీరికి ఈగ మల్లేశం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమకు రావలసిన సంక్షేమ పథకాలకు కూడా సింహ భాగం కేటాయించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎప్పుడు లేని విధంగా నేడు పద్మశాలీల సంఘటితాన్ని చూస్తే చాలా సంతోషంగా ఉందని,ఇదే స్ఫూర్తితో మునుముందుకు పోవాలని ఆశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దూరి రాజ్ కుమార్, చిదురాల కేదారి,సాంబరాజు,పెద్దూరి సత్యం, చెన్న, వెంకటేశ్వర్లు, చెన్న శ్రీధర్, పసునూరి ప్రవీణ్, చిప్ప వెంకటేశ్వర్లు,గోక శ్రీనివాస్, రామచంద్రు, వివిధ హోదాలలో ఉన్న పద్మశాలీలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దాళారులను నమ్మి మోసపోవద్దు





**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద...**

**వరంగల్ ప్రతినిధి,1 డిసెంబర్(తరంగాలు):** రైతులు కష్టపడి పండించిన ధాన్యంను ఎక్కడ కూడా దాళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకే అమ్ముకోవాలని జిల్లా కలెక్టర్ సత్య శారద రైతులకు సూచించారు. వరంగల్ జిల్లాపర్వతగిరి మండలంలోని జమంలాపూర్, సోమవారం, వడ్లకొండ ధాన్యం కొనుగోలు కేంద్రాలను,మండలంలోని వినాయక రైస్ మిల్ ను ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆకస్మికంగా తనిఖీ చేశారు.వడ్ల కొనుగోలు కేంద్రంలోని ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలంచారు. వర్షం కురిసే అవకాశం ఉన్నందున కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచి నిల్వ ఉన్న ధాన్యంపై కప్పాలని సూచించారు.అనంతరం రైతులతో మాట్లాడుతూరైతులు ధాన్యం విక్రయించే సమయంలో వ్యవసాయ అధికారులు జారీ చేస్తున్న టోకెన్లు, ధాన్యం తేమ శాతం, గన్నీ బ్యాగుల వివరాలు తెలుసుకున్నారు. ధాన్యాన్ని కేంద్రంలో నిల్వ ఉంచకుండా వెంటనే తూకం వేసి బిల్లులు చేయాలని ఆదేశించారు.సన్నా బియ్యంను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి ప్రభుత్వ ప్రత్యేకంగా ఇస్తున్న రూ.500 సబ్సిడీ పొందాలని తెలిపారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ సంధ్యారాణి, డిటి లు ఉన్నారు.